

మన జనప్రగతి

జనం కోసం.. అక్షర ప్రగతి...

తెలుగు దినపత్రిక

సంపుటి : 6 | సంచిక : 277 | పేజీలు : 8 | వెల : రూ.2/- | శనివారం 31 అక్టోబర్ 2026 | వైయస్ఆర్ కడప

Kadapa, Ananthapur, Chittor, Vishakapatanam, Srikakulam, Elluru, Thirupathi, Ongole, Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool

తుఫాన్ బాధిత రైతులకు భారీ భరోసా!



65 రకాల పంటలకు నష్టపరిహారం.. హెక్టారుకు రూ.25 వేల ఇన్‌పుట్ సబ్సిడీ

మృతుల కుటుంబాలకు రూ.5 లక్షలు.. దెబ్బతిన్న ఇళ్లకు రూ.10 వేల ఆర్థిక సాయం

కిరాణా దుకాణాలకు రూ.25 వేలు.. చేనేత కార్మికులకూ పరిహారం

బాధితులకు అండగా ఉంటాం.. పంట నష్టాన్ని సమగ్రంగా అంచనా వేస్తాం: సీఎం చంద్రబాబు





పశ్చిమగోదావరి,మన జనప్రగతి అక్టోబర్ 30: ఆర్నబ్ తుఫాన్ ప్రభావంతో నష్టపోయిన రైతులు, ప్రజలను ఆదుకునేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. తుఫాన్ కారణంగా దెబ్బతిన్న 65 రకాల పంటలకు నష్టపరిహారం అందిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రకటించారు. పంటల బీమా పరిధిలో ఉన్న రైతులకు బీమా పరిహారంతో పాటు మిగతా2లో...

మత్స్యకారుల సమస్యలకు శాశ్వత పరిష్కారం!

- **వేట పడవలకు బీమా కల్పించేలా ప్రతిపాదనలు సిద్ధం చేయండి**
- **ఉప్పాడ తీర రక్షణ గోడ పనులు వేగవంతం చేయాలి**
- **దీపావళి తర్వాత మత్స్యకార గ్రామాల్లో పర్యటిస్తా...**
- **తుఫాన్ నష్టంపై అధికారులతో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సమీక్ష**

అమరావతి,మన జనప్రగతి అక్టోబర్ 30: తీర ప్రాంత మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యలకు శాశ్వత పరిష్కారాలు చూపే దిశగా ప్రణాళికలు రూపొందించాలని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అధికారులను ఆదేశించారు. ప్రకృతి విపత్తులు సంభవించిన ప్రతిసారీ తాత్కాలిక సహాయక చర్యలు చేపట్టడం కాకుండా, తీర ప్రాంత ప్రజలకు దీర్ఘకాలిక రక్షణ కల్పించే చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. వేట పడవలకు బీమా సౌకర్యం కల్పించే అంశాన్ని పరిశీలించి, సాధ్యాసాధ్యాలతో కూడిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు.శుక్రవారం అమరావతి నుంచి కాకినాడ జిల్లా కలెక్టర్ హరేందిర ప్రసాద్, మిగతా2లో...

జనవరి 25 నుంచి దేశవ్యాప్తంగా జనగణన!

ఫిబ్రవరి 28 వరకు జనాభా లెక్కల సేకరణ

ఎన్నికలు జరిగే ఐదు రాష్ట్రాలకు తాత్కాలిక మినహాయింపు



న్యూఢిల్లీ, మన జనప్రగతి అక్టోబర్ 30: దేశవ్యాప్తంగా 2027 జనవరి 25 నుంచి ఫిబ్రవరి 28 వరకు జనగణన నిర్వహించనున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు కేంద్ర హోంశాఖ అక్టోబర్ 30న అధికారిక ప్రకటన జారీ చేసింది. ఎన్నికలు జరగనున్న మిగతా2లో...

పోలింగ్ కేంద్రాల వద్ద భద్రత కట్టుదిట్టం!

- ఎన్నికలు స్వేచ్ఛగా, పారదర్శకంగా నిర్వహించాలి
- ఫిర్యాదులపై తక్షణ స్పందన.. నిష్పక్షపాత విచారణకు ఆదేశాలు



అమరావతి,మన జనప్రగతి అక్టోబర్ 30: తీర ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్‌చంద్ర పునేఠా అధికారులను ఆదేశించారు. ఎన్నికలు ప్రశాంతంగా, స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, ఎన్నికల పరిశీలకులు, పోలీసు అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.విజయవాడలోని రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యాలయం నుంచి శుక్రవారం సీడీఎంఏ సంపత్‌కుమార్, కలెక్టర్లు, ఎస్పీలు, పోలీసు కమిషనర్లు, డీఐజీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మిగతా2లో...



రెబల్ అభ్యర్థులపై టీడీపీ వేటు!

- **స్థానిక ఎన్నికల్లో పార్టీ నిర్ణయాన్ని ధిక్కరించిన 11 మందిపై సస్పెన్షన్**
- **కూటమి అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని అధిష్ఠానం**

హైస్పీడ్ రైలు మార్గాల పనులు వేగవంతం చేయండి!

- **తెలంగాణకు ప్రకటించిన మూడు కారిడార్లకు త్వరగా అనుమతులు ఇవ్వాలి**
- **కొత్త రైల్వే మార్గాల మంజూరుకు సీఎం రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి**
- **అనంతారంలో మెగా ఫ్లైట్ నిర్వహణ డిపో ఏర్పాటు చేయండి**





సింగరేణి కార్మికులకు దీపావళి కానుక!

ఒక్కో కార్మికుడికి గరిష్టంగా రూ.1,10,250 బోనస్

నవంబర్ 5న బ్యాంకు ఖాతాల్లో జమ.. భట్టి విక్రమార్క వెల్లడి

హైదరాబాద్,మన జనప్రగతి అక్టోబర్ 30: సింగరేణి కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం దీపావళి కానుక ప్రకటించింది. నవంబర్ 5న కార్మికులకు దీపావళి బోనస్ చెల్లించాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సింగరేణి యాజమాన్యాన్ని ఆదేశించారు. ఒక్కో అర్హత కలిగిన కార్మికుడికి గరిష్టంగా రూ. 1,10,250 చొప్పున మొత్తం 38 వేల మందికి రూ.419 కోట్లు చెల్లించనున్నారు.ఇప్పటికే దసరా లాభాల వాటా కింద రూ.600 కోట్లు చెల్లించగా, మిగతా2లో...

36 వేల మంది పోలీసులతో పటిష్ఠ బందోబస్తు!

- **ఏపీలో 4,372 ప్రాంతాల్లో భద్రతా ఏర్పాట్లు**
- **ఎన్నికల వేళ 261 కేసులు.. 107 మంది అరెస్టు**
- **1.05 లక్షల మందిపై ముందస్తు బైండోవర్ చర్యలు**



అమరావతి,మన జనప్రగతి అక్టోబర్ 30: ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంతంగా, స్వేచ్ఛాయుతంగా నిర్వహించేందుకు భారీ భద్రతా ఏర్పాట్లు చేసినట్లు డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 4,372 ప్రాంతాల్లో 36,351 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశామని వెల్లడించారు. సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక నిఘా కొనసాగుతోందని పేర్కొన్నారు.అక్టోబరు 15 నుంచి 29వ తేదీ మిగతా2లో...

మనజనప్రగతి
జనం కోసం.. అక్షర ప్రగతి...
తెలుగు దినపత్రిక

తుఫాన్ బాధిత రైతులకు భారీ భరోసా!

(మొదటి పేజీ తరువాయి)

హెక్టారుకు రూ.25 వేల చొప్పున ఇన్‌పుట్ సబ్సిడీ అందిస్తామని హామీ ఇచ్చారు. పంట నష్టాన్ని సమగ్రంగా అంచనా వేసి అర్హులైన ప్రతి బాధితుడికి న్యాయం చేస్తామని స్పష్టం చేశారు. శుక్రవారం పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరు మండలం మొగ్రేవు గ్రామంలో తుఫాన్ బాధిత ప్రాంతాలను ముఖ్యమంత్రి సందర్శించారు. తుఫాన్ కారణంగా నష్టపోయిన కుటుంబాలను పరామర్శించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బాధితులకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రైతులు, స్థానిక ప్రజలు తమకు జరిగిన నష్టాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. పంటలు నీట మునగడం, ఉద్యాన పంటలు దెబ్బతినడం, ఇళ్లు, దుకాణాలకు నష్టం వాటిల్లిన అంశాలను వివరించారు.ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. తుఫాన్ ప్రభావంతో ఉమ్మడి గోదావరి జిల్లాల్లో వరి, ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లిందని తెలిపారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. పంట నష్టంపై అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి పూర్తి వివరాలు సేకరించాలని ఆదేశించారు. నష్టపరిహారం అందించే ప్రక్రియలో అర్హులైన రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.తుఫాన్ కారణంగా ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందిస్తామని చంద్రబాబు ప్రకటించారు. దెబ్బతిన్న ఇళ్లకు రూ.10 వేల చొప్పున, కిరాణా దుకాణాలకు రూ.25 వేల చొప్పున సాయం అందిస్తామని తెలిపారు. చేనేత కార్మికులకు కూడా రూ.25 వేల ఆర్థిక సాయం ప్రకటించారు. అక్వా రంగానికి జరిగిన నష్టాన్ని పరిశీలించి తగిన సహాయం అందించే అంశాన్ని పరిశీలిస్తామని వెల్లడించారు. తుఫాన్ ప్రభావంతో పడిపోయిన విద్యుత్ స్తంభాలు, రహదారులపై కూలిన చెట్లను తొలగించే పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా విద్యుత్ సరఫరాను వీలైనంత త్వరగా పునరుద్ధరించాలని సూచించారు. ఇళ్లకు విద్యుత్ సరఫరా పునరుద్ధరించిన అనంతరం వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లను పునరుద్ధరిస్తామని తెలిపారు.అలాగే డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరిచేందుకు రూ.3 వేల కోట్లతో ప్రక్షాళన చేపడతామని ముఖ్యమంత్రి వెల్లడించారు. వశిష్ట గోదావరి నది ప్రక్షాళనకు సంబంధించి అధ్యయనం నిర్వహిస్తామని తెలిపారు. తుఫాన్ అనంతర పరిస్థితులను అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని, బాధితులకు అవసరమైన సహాయక చర్యలు అందించాలని ఆదేశించారు. రైతులు, ప్రజలు ధైర్యంగా ఉండాలని, నష్టపోయిన ప్రతి రంగాన్ని ఆదుకునేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని చంద్రబాబు భరోసా ఇచ్చారు.

మత్స్యకారుల సమస్యలకు శాశ్వత పరిష్కారం!

(మొదటి పేజీ తరువాయి)

జిల్లా ఎస్పీ బిందు మాధవ్, ఇతర అధికారులతో పాటు తీర ప్రాంత గ్రామాల ప్రజలతో పవన్ కల్యాణ్ వర్చువల్ సమావేశం నిర్వహించారు. ఆర్నబ్ తుఫాన్ ప్రభావంతో జిల్లాలో జరిగిన నష్టం, బాధితులకు అందుతున్న సహాయక చర్యలు, పునరుద్ధరణ పనుల పురోగతిపై సమీక్షించారు. తుఫాన్ కారణంగా మత్స్యకారులు, రైతులు, చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. **ఉప్పాడ తీరానికి రక్షణ కల్పించాలి** ఉప్పాడ తీర ప్రాంతంలో సముద్ర కోత సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని పవన్ కల్యాణ్ అధికారులకు సూచించారు. తీర రక్షణ గోడ నిర్మాణానికి సంబంధించిన నమూనాలు, సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) తయారీని వేగవంతం చేయాలని ఆదేశించారు. కోనపాపపేట వరకు రక్షణ గోడను పొడిగించే ప్రతిపాదనకు త్వరగా అనుమతులు వచ్చేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. తుఫాన్ కారణంగా తీవ్రంగా దెబ్బతిన్న ఉప్పాడకాకినాడ బీచ్ రహదారిని వెంటనే పునరుద్ధరించాలని స్పష్టం చేశారు.**మత్స్యకార గ్రామాల్లో పర్యటన** దీపావళి అనంతరం తీర ప్రాంత మత్స్యకార గ్రామాల్లో స్వయంగా పర్యటించి వారి సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తానని పవన్ కల్యాణ్ తెలిపారు. మత్స్యకారుల జీవనోపాధికి సంబంధించిన ఇబ్బందులను అధికారులతో చర్చించి పరిష్కార మార్గాలను అన్వేషిస్తానన్నారు. వేట పడవలు, వలలు, ఇళ్లు, పంటలకు జరిగిన నష్టాన్ని త్వరగా అంచనా వేసి సమగ్ర నివేదిక రూపొందించాలని అధికారులను ఆదేశించారు.**10 వేల మందికి పైగా సురక్షిత ప్రాంతాలకు తరలింపు** కాకినాడ జిల్లాలోని 92 తీర ప్రాంత ఆవాసాల నుంచి 10 వేల మందికి పైగా ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించి, 102 పునరావాస కేంద్రాల్లో ఆశ్రయం కల్పించిన జిల్లా యంత్రాంగాన్ని ఉప ముఖ్యమంత్రి అభినందించారు. సూరాడపేట, మాయపట్నం, కొత్తపట్నం, నాయికర్ కాలనీల్లోకి చేరిన సముద్రపు నీటిని ఫిర్యాదులు అందిన 24 గంటల్లోనే తొలగించడంపై అధికారులను ప్రశంసించారు. తుఫాన్ బాధితులకు అవసరమైన నిత్యావసర సరుకుల పంపిణీ నిరంతరాయంగా కొనసాగించాలని సూచించారు.ముంపునకు గురైన గ్రామాల ప్రజలకు 25 కిలోల బియ్యం, మత్స్యకారులు, చేనేత కార్మికులకు 50 కిలోల చొప్పున బియ్యం అందించాలని అధికారులకు సూచించారు. పప్పులు, వంటనూనె, ఉల్లిపాయలు, బంగాళాదుంపలు, చక్కెర తదితర నిత్యావసర సరుకులను కూడా పంపిణీ చేయాలని ఆదేశించారు. తుఫాన్ ప్రభావంతో అంతరాయం ఏర్పడిన విద్యుత్ సరఫరాను పునరుద్ధరించడంతో పాటు, దెబ్బతిన్న రహదారుల మరమ్మతులను త్వరగా పూర్తి చేయాలని తెలిపారు.పోలీసు, రెవెన్యూ, మున్సిపల్, విద్యుత్, వైద్య ఆరోగ్య శాఖల అధికారులు తుఫాన్ సమయంలో అందించిన సేవలను పవన్ కల్యాణ్ అభినందించారు. బాధితులకు సహాయం అందించడంలో ఎలాంటి జాప్యం జరగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. తుఫాన్ నష్టాన్ని సమగ్రంగా అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక సమర్పించాలని జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు.

హైస్పీడ్ రైలు మార్గాల పనులు వేగవంతం చేయండి!

న్యూఢిల్లీ,మన జనప్రగతి అక్టోబర్ 30: తెలంగాణకు ప్రకటించిన హైస్పీడ్ రైలు మార్గాల పనులను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను కోరారు. హైదరాబాద్ పుణె, హైదరాబాద్‌బెంగళూరు, హైదరాబాద్‌చెన్నై హైస్పీడ్ కారిడార్లకు సంబంధించి కేంద్రం పంపిన ప్రతిపాదనలను రాష్ట్ర ప్రభుత్వం సమీక్షించి, కొన్ని మార్పులను సూచిస్తూ తిరిగి పంపినట్లు తెలిపారు. కేంద్రం త్వరగా మార్గాల అమరికను ఖరారు చేస్తే భూసేకరణ ప్రక్రియను ప్రారంభిస్తామని స్పష్టం చేశారు.శుక్రవారం ఢిల్లీలోని రైల్ భవన్‌లో కేంద్ర మంత్రితో సీఎం సమావేశమై తెలంగాణకు అవసరమైన కీలక రైల్వే ప్రాజెక్టులపై చర్చించారు. వికారాబాద్‌కృష్ణా మధ్య 130 కిలోమీటర్ల కొత్త రైల్వే మార్గాన్ని వెంటనే మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. టేకల్‌కోడ్ పరిసరాల్లో భారీ సున్నపురాయి నిక్షేపాలు ఉన్నందున ఆ ప్రాంతాన్ని సిమెంట్, వస్త్ర పరిశ్రమల కేంద్రంగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు వివరించారు. హైదరాబాద్ చుట్టూ నిర్మిస్తున్న సుమారు 360 కిలోమీటర్ల ప్రాంతీయ రింగ్ రోడ్డు పక్కనే ప్రాంతీయ రైలు మార్గాన్ని ఏర్పాటు చేసేలా మార్గాన్ని ఖరారు చేయాలని సీఎం కోరారు. ఈ రైలు మార్గం అందుబాటులోకి వస్తే పెద్దఎత్తున ఉపాధి అవకాశాలు కలుగుతాయని తెలిపారు.డోర్నకల్‌గద్వాల, కల్వకుర్తి మాచర్ల, కాచిగూడజగ్గయ్యపేట (250 కి.మీ.), పటాన్‌చెరుఆదిలాబాద్ (320 కి.మీ.), బోధన్‌లాతూర్ (175 కి.మీ.), అక్కన్నపేట బైపాస్ (8 కి.మీ.) రైల్వే మార్గాలకు వెంటనే అనుమతులు మంజూరు చేయాలని కేంద్ర మంత్రిని కోరారు.మహబూబాబాద్ సమీపంలోని అనంతారం గ్రామంలో దక్షిణ మధ్య రైల్వే ప్రతిపాదించిన మెగా కోచింగ్, సరుకు రవాణా నిర్వహణ డిపోను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ డిపో కోసం అవసరమైన 409 ఎకరాల ఒక గుంట భూమిని రైల్వే శాఖకు అప్పగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే అంగీకరించిందని తెలిపారు. ప్రాజెక్టుకు త్వరగా అనుమతులు ఇవ్వాలని కోరారు.ఈ సమావేశంలో రాష్ట్ర మంత్రి వివేక్ వెంకటస్వామి, ఎంపీలు మల్లు రవి, వేం నరేందర్‌రెడ్డి, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, బలరాం నాయక్, గడ్డం వంశీకృష్ణ, అనిల్‌కుమార్ యాదవ్, రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధి ఎన్డీఏ కూటమితోనే!

అభివృద్ధి చేసే వారికే పట్టం కట్టండి

స్థానిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించాలని హోంమంత్రి అనిత పిలుపు



అమరావతి,మన జనప్రగతి అక్టోబర్ 30: గ్రామాల్లో అభివృద్ధి ఎన్డీఏ కూటమి పాలనలోనే జరుగుతోందని ఆంధ్రప్రదేశ్ హోంమంత్రి వంగలపూడి అనిత అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం పాయకరావుపేట నియోజకవర్గంలోని ఎస్.రాయవరం, పాయకరావుపేట మండలాల్లో ఆమె విస్తృతంగా పర్యటించి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా అనిత మాట్లాడుతూ.. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ నాయకత్వాన్ని దృష్టిలో ఉంచుకుని కూటమి అభ్యర్థులకు ఓటు వేయాలని కోరారు. నియోజకవర్గంలో ఇప్పటికే పలు గ్రామాలకు రహదారులు నిర్మించామని, అనేక అభివృద్ధి కార్యక్రమాలు పూర్తి చేశామని తెలిపారు.అడ్డరోడ్డు నుంచి నర్సీపట్నం వరకు రహదారి పనులు పూర్తి చేశామని పేర్కొన్నారు. నియోజకవర్గానికి స్టీల్ ప్లాంట్, బల్క్ డ్రగ్ పార్క్, టాయ్ పార్క్ వంటి పరిశ్రమలు వస్తున్నాయని వివరించారు. టాయ్ పార్క్ ద్వారా సుమారు 25 వేల మంది మహిళలకు ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయని తెలిపారు. గోదావరి జలాలను పాయకరావుపేట నియోజకవర్గానికి తీసుకురావడం సంతోషకర మన్నారు. గ్రామాల అభివృద్ధికి కృషి చేసే అభ్యర్థులను గెలిపించాలని హోంమంత్రి అనిత కోరారు.

జనవరి 25 నుంచి దేశవ్యాప్తంగా జనగణన!

(మొదటి పేజీ తరువాయి)

ఉత్తరప్రదేశ్, మణిపూర్, గోవా, పంజాబ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాలకు ప్రస్తుతం జనగణన నుంచి మినహాయింపు ఇచ్చింది. లడఖ్‌తో పాటు హిమాచల్‌ప్రదేశ్, జమ్మూకశ్మీర్‌లోని మంచు ప్రభావిత ప్రాంతాల్లోనూ ఈ షెడ్యూల్ వర్తించదు.జనగణనలో భాగంగా 2027 జనవరి 10 నుంచి 24 వరకు ప్రజలకు స్వీయ గణన (సెల్ఫ్ ఎన్యుమరేషన్) చేసుకునే అవకాశం కల్పించనున్నారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి జనాభా వివరాలను సేకరిస్తారు. మార్చి 1 నుంచి 5 వరకు పునఃపరిశీలన ప్రక్రియ నిర్వహించనున్నారు. 2027 మార్చి 1 అర్ధరాత్రి 12 గంటలను జనగణన ప్రామాణిక తేదీగా నిర్ణయించారు. మినహాయింపు పొందిన రాష్ట్రాలు, ప్రాంతాలకు సంబంధించిన తేదీలను తరువాత ప్రకటించనున్నారు.

పోలింగ్ కేంద్రాల వద్ద భద్రత కట్టుదిట్టం!

(మొదటి పేజీ తరువాయి)

ఎన్నికల నిర్వహణ, శాంతిభద్రతలు, రాజకీయ పార్టీల ఫిర్యాదులు, పోలింగ్, కౌంటింగ్ ఏర్పాట్లపై సమీక్షించారు. అధికారులు ఎలాంటి నిర్లక్ష్యం, పక్షపాతం లేకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ఓటర్లు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునే వాతావరణం కల్పించాలని పునేఠా స్పష్టం చేశారు.ఎన్నికల ప్రారంభ దశలో ఏడు జిల్లాల నుంచి అందిన ఫిర్యాదులను డీజీపీ, కలెక్టర్లు, ఎస్పీలు, పోలీసు కమిషనర్లకు పంపించి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి పోలింగ్ కేంద్రానికి ఓటర్ల సంఖ్య, భద్రతా ఏర్పాట్లు, కేంద్రం వివరాలతో సమగ్ర ప్రణాళిక రూపొందించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యదర్శి మల్లికార్జున సూచించారు.ఒక్క బ్యాలెట్ పేపర్ కూడా గల్లంతు కాకుండా పటిష్ఠ భద్రత కల్పించాలని, స్ట్రాంగ్‌రూమ్‌లకు సుమారు 100 మీటర్ల దూరంలో ప్రత్యేక నియంత్రణ గది ఏర్పాటు చేయాలని తెలిపారు. ప్రిసైడింగ్ అధికారి అనుమతి లేకుండా ఎవరూ పోలింగ్ కేంద్రాల్లోకి ప్రవేశించరాదని స్పష్టం చేశారు. ఓటింగ్ గోప్యతకు భంగం కలగకుండా మీడియా ప్రతినిధులు వ్యవహరించాలని సూచించారు.సున్నిత ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, సాంకేతిక పరిజ్ఞానంతో ప్రతి కదలికను రికార్డు చేయాలని ఐజీ బి.రాజకుమారి ఆదేశించారు. పోలీసు సిబ్బంది సైతం ప్రిసైడింగ్ అధికారి అనుమతితోనే పోలింగ్ కేంద్రాల్లోకి వెళ్లాలని, కేంద్రాల చుట్టూ 100 మీటర్ల పరిధిలో గుంపులు ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

రెబల్ అభ్యర్థులపై టీడీపీ వేటు!

అమరావతి,మన జనప్రగతి అక్టోబర్ 30:

ఆంధ్రప్రదేశ్ స్థానిక సంస్థల ఎన్నికల వేళ తెలుగుదేశం పార్టీ క్రమశిక్షణ చర్యలకు దిగింది. పార్టీ నిర్ణయాన్ని ధిక్కరిస్తూ ఎన్నికల బరిలో నిలిచిన 11 మంది రెబల్ అభ్యర్థులను సస్పెండ్ చేసింది. కూటమి తరఫున అధికారికంగా ప్రకటించిన అభ్యర్థులకు వ్యతిరేకంగా పోటీ చేయడాన్ని పార్టీ తీవ్రంగా పరిగణించింది.టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పార్టీ నాయకులతో నిర్వహించిన సమావేశంలో రెబల్ అభ్యర్థుల వ్యవహారంపై స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. కూటమి ధర్మాన్ని పాటిస్తూ టీడీపీ, జనసేన, బీజేపీ అభ్యర్థుల విజయానికి నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని సూచించారు.సీట్ల సర్దుబాటులో భాగంగా నిర్ణయించిన అభ్యర్థులకే మద్దతు ఇవ్వాలని, పార్టీ నిర్ణయాలకు వ్యతిరేకంగా వ్యవహరించే వారిపై క్రమశిక్షణ చర్యలు తప్పవని అధిష్ఠానం స్పష్టం చేసింది. స్థానిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి మంత్రులు, ముఖ్య నాయకులు బాధ్యత తీసుకోవాలని చంద్రబాబు ఆదేశించారు.

సింగరేణి కార్మికులకు దీపావళి కానుక!

(మొదటి పేజీ తరువాయి)

తాజా బోనస్‌తో కలిపి ఒకే నెలలో కార్మికులకు అందుతున్న మొత్తం రూ.1,020 కోట్లకు చేరనుంది. ఉప ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి నవంబర్ 5న కార్మికుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమయ్యేలా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ బోనస్ జాతీయ వేతన ఒప్పందం (ఎన్‌సీడబ్ల్యూఏ) పరిధిలోని కార్మికులకు మాత్రమే వర్తిస్తుంది. గత ఆర్థిక సంవత్సరంలో కనీసం 30 రోజులు పనిచేసిన వారు అర్హులు. నిర్దేశిత పనిదినాలు పూర్తి చేసిన వారికి పూర్తి బోనస్, అంతకంటే తక్కువ రోజులు పనిచేసిన వారికి పని చేసిన కాలానికి అనుగుణంగా బోనస్ చెల్లించనున్నారు.

36 వేల మంది పోలీసులతో పటిష్ఠ బందోబస్తు!

(మొదటి పేజీ తరువాయి)

వరకు ఎన్నికలకు సంబంధించి రాష్ట్రవ్యాప్తంగా 261 కేసులు నమోదయ్యాయని డీజీపీ వివరించారు. తిరుపతి జిల్లాలో అత్యధికంగా 61 కేసులు, వైఎస్సార్ కడపలో 36, అన్నమయ్యలో 31, అనంతపురంలో 26, మార్కాపురంలో 22 కేసులు నమోదయ్యాయి. ఈ కేసుల్లో మొత్తం 107 మందిని అరెస్టు చేయగా, మరో 733 మందికి భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (బీఎన్ఎస్-ఎస్)లోని సెక్షన్ 35(3) కింద నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు.

ఎన్నికల సమయంలో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా 1,05,767 మందిని ముందస్తుగా బైండోవర్ చేసినట్లు వెల్లడిం చారు. పెండింగ్‌లో ఉన్న 2,726 నాన్ బెయిలబుల్ వారెంట్లను అమలు చేసినట్లు చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన తనిఖీల్లో నగదు, మద్యం, ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఓటర్లు ఎలాంటి భయం, ఒత్తిడి, ప్రలోభాలకు గురికాకుండా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా పోలీసు సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని డీజీపీ స్పష్టం చేశారు. ఎన్నికల ప్రక్రియకు ఆటంకం కలిగించే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

స్థానిక ఎన్నికలకు బ్రేక్ లేదు!

- **తుఫాను సాకుతో ఎన్నికల వాయిదాకు హైకోర్టు నిరాకరణ**
- **సాధారణ పరిస్థితులు నెలకొన్నాయి.. ఎన్నికలు వాయిదా అవసరం లేదు: ఎస్ఈసీ**

అమరావతి,మన జనప్రగతి అక్టోబర్ 30: ఆర్నబ్ తుఫాను నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికలను వాయిదా వేయాలంటూ దాఖలైన పిటిషన్‌పై హైకోర్టు విచారణ జరిపింది. ఎన్నికలను వాయిదా వేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని ఆదేశించాలంటూ బీసీవై పార్టీ అధ్యక్షుడు బోడే రామచంద్ర యాదవ్ దాఖలు చేసిన పిటిషన్‌ను పరిశీలించింది.ఎస్ఈసీ తరఫు న్యాయవాది ఎన్. అశ్వనీ కుమార్ వాదనలు వినిపిస్తూ.. తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో ఇప్పటికే సాధారణ పరిస్థితులు నెలకొన్నాయని, మొత్తం ఎన్నికలను వాయిదా వేయాల్సిన అవసరం లేదని కోర్టుకు వివరించారు. ఈ వాదనలను నమోదు చేసుకున్న న్యాయమూర్తి జస్టిస్ మండవ కిరణ్మయి.. ప్రస్తుత పిటిషన్‌లో ఆదేశాలు జారీ చేయాల్సిన అవసరం లేదని పేర్కొంటూ వ్యాజ్యాన్ని పరిష్కరించారు.మరోవైపు పులివెందుల మున్సిపాలిటీ ఎన్నికల సందర్భంగా భద్రతా చర్యలు తీసుకోవాలని వైసీపీ ఎంపీ అవినాశ్‌రెడ్డి ఇచ్చిన వినతిపై తగిన నిర్ణయం తీసుకోవాలని ఎస్ఈసీని హైకోర్టు ఆదేశించింది. ఈ పిటిషన్‌పై తదుపరి విచారణను సోమవారానికి వాయిదా వేసింది.డోన్ మున్సిపాలిటీ ఎన్నికల్లో ఒకరి ఓటును మరొకరు వేయకుండా చర్యలు తీసుకోవాలని, ఓటర్ల జాబితా నుంచి తొలగించిన వారి పేర్లతో ఇతరులు ఓటు వేయకుండా చూడాలని దాఖలైన పిటిషన్‌పైనా ఎస్ఈసీ తగిన నిర్ణయం తీసుకోవాలని హైకోర్టు సూచించింది.

కేంద్ర మంత్రి టోఖన్ సాహును కలిసిన బీజేపీ మండల అధ్యక్షుడు కరణం నరేష్

- పత్తికొండ పేదలకు అధిక సంఖ్యలో ఇళ్లు మంజూరు చేయాలని విజ్ఞప్తి
- అర్హులకు ఇళ్ల మంజూరుకు సహకరిస్తామని మంత్రి హామీ



పత్తికొండ మన జనప్రగతి అక్టోబర్ 30:-కేంద్ర గృహ నిర్మాణం, పట్టణ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి టోఖన్ సాహును పత్తికొండ బీజేపీ మండల అధ్యక్షుడు కరణం నరేష్ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతపురం జిల్లా ధర్మవరం టోల్‌ప్లాజా సమీపంలో జరిగిన ఈ భేటీలో పత్తికొండ నియోజకవర్గంలోని పేద, నిరుపేద కుటుంబాలకు ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద అధిక సంఖ్యలో ఇళ్లు మంజూరు చేయాలని కోరారు.నియోజకవర్గంలో సొంత ఇళ్లు లేని అర్హులైన పేద కుటుంబాలకు ఇళ్లు మంజూరు చేసి, వారి సొంతింటి కలను నెరవేర్చాలని కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశవ్యాప్తంగా లక్షలాది పేద కుటుంబాలకు పక్కా ఇళ్లు అందించడం అభినందనీయమని పేర్కొంటూ, పత్తికొండ ప్రాంతానికి మరిన్ని ఇళ్లు కేటాయించి నిర్మాణాలకు అవసరమైన సహకారం అందించాలని కోరారు.దీనిపై సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి టోఖన్ సాహు పత్తికొండ నియోజకవర్గంలోని అర్హులైన పేదలకు ఇళ్ల మంజూరు విషయంలో అన్ని విధాలా సహకరిస్తామని హామీ ఇచ్చినట్లు కరణం నరేష్ తెలిపారు. బీజేపీ నాయకులు దాసరి నాగరాజు, ఎద్దుల దొడ్డి కృష్ణ, రామాంజనేయులు, అంజి, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చిన్నకుడాల, రామట్లపల్లెలో సరళ దేవికి మద్దతుగా జోరుగా ప్రచారం



లింగాల మన జనప్రగతి అక్టోబర్ 30:-లింగాల మండలంలో కూటమి బలపర్చిన జడ్పీటీసీ అభ్యర్థి విజయం కోసం కూటమి నాయకులు విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. లింగాల మండల టీడీపీ అధ్యక్షుడు విశ్వనాథ రెడ్డి సతీమణి, కూటమి జడ్పీటీసీ అభ్యర్థి యమ్మనూరు సరళ దేవి గెలుపును కాంక్షిస్తూ శుక్రవారం చిన్నకుడాల, రామట్లపల్లె గ్రామాలలో ఎన్నికల ప్రచారం జోరుగా సాగింది. ఈ ప్రచార కార్యక్రమంలో లింగాల మండల టీడీపీ ఇంచార్జ్ దేవిరెడ్డి సంజీవరెడ్డి,లింగాల సింగిల్ విండో చైర్మన్ నవీన్ కుమార్ రెడ్డి, చిన్నకూడల "ఎంపీటీసీ లోమాడ స్నేహ' మండల ఆర్గనైజింగ్ సెక్రటరీ రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు. నాయకులు గ్రామంలోని ప్రతీ ఇంటికీ తిరిగి ప్రజలను నేరుగా కలిశారు. కూటమి అభ్యర్థి యమ్మనూరు సరళ దేవికి ఓటు వేసి, అత్యధిక మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థించారు.ఈ సందర్భంగా టీడీపీ నాయకులు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో, పులివెందుల టీడీపీ ఇంచార్జ్ బీటెక్ రవి సహకారంతో కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ప్రజల మద్దతుతో కూటమి విజయం లాంఛనమేనని, సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్న కూటమి అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపించాలని వారు పిలుపునిచ్చారు.

వేంపల్లెలో ఘనంగా మాజీ సర్పంచ్ ఆర్. శ్రీను పుట్టినరోజు వేడుకలు

- అనాథ వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదానం, బట్టలు,పంపిణీ



వేంపల్లె మన జన ప్రగతి అక్టోబర్ 30:-వేంపల్లె మేజర్ గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ ఆర్. శ్రీనివాసులు జన్మదిన వేడుకలను ఆయన అభిమానులు, వైకాపా పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. వేంపల్లె లో ఆయన అభిమా నులు స్థానిక దివ్యాంగుల భవిత కేంద్రంలో బారీ కేక్ ను కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. భవిత కేంద్రంలోని విద్యార్థులకు అన్నదానం, పుస్తకాలు, పలకలు,పంపిణీ చేశారు. అనంతరం స్థానిక గండి రోడ్డులో ఉన్న వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదానం, బట్టలు,పంపిణీ చేశారు.మాజీ సర్పంచ్ రాచినేని శ్రీనివాసులు పుట్టినరోజు సందర్భంగా ఇలాంటి సేవా కార్యక్రమాలు చేయడం మంచి కార్యక్రమం అని ఆయన అభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తన పుట్టినరోజు సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు చేసిన తన అభిమానులకు, వైకాపా పార్టీ శ్రేణులకు ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ శ్రీనివాసులు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైకాపా రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రాచినేని వేణు, చిన్నారెడ్డి, సింగారెడ్డి భరత్ కుమార్ రెడ్డి, కసిరెడ్డి ఆది నారాయణరెడ్డి దివాకర్ రెడ్డి,నాగేష్, బ్రహ్మం,లోకేష్, తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంలో కడప జిల్లా రైతులకు కిసాన్ మహారాజ్ అవార్డులు

- గోగుల రాధాకృష్ణ, దండిబోయిన బాలాజీకి పురస్కారాలు



కడప, మన జనప్రగతి, అక్టోబర్ 30:- ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో ప్రతిభ కనబరిచిన వైఎస్సార్ కడప జిల్లాకు చెందిన ఇద్దరు రైతులకు ప్రతిష్ఠాత్మక కిసాన్ మహారాజ్ అవార్డులు-2026 లభించాయి. బద్వేలు మండలం అబుసాహెబ్‌పేటకు చెందిన గోగుల రాధాకృష్ణ, చెన్నూరు మండలం బాలసింగాయపల్లికి చెందిన దండిబోయిన బాలాజీ ఈ అవార్డులకు ఎంపికయ్యారు. హైదరాబాద్‌లోని శిల్పకళావేదికలో విష్ టీవీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వీరికి పురస్కారాలు అందజేశారు. ప్రకృతి వ్యవసాయ విధానాలతో వరి, కరివేపాకు, పసుపు పంటలను విజయవంతంగా సాగుచేసినందుకు ఈ గుర్తింపు లభించింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి రైతులను అభినందిస్తూ, వారి విజయాలు జిల్లాకు గర్వకారణమని పేర్కొన్నారు. ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్న వ్యవసాయ శాఖ, ఏపీసీఎన్ఎఫ్ అధికారుల సేవలను కూడా ప్రశంసించారు.

అధికార బలంతో ప్రజాస్వామ్య హక్కులను కాలరాసిన టీడీపీ

మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి

ప్రొద్దుటూరు మన జనప్రగతి అక్టోబర్ 30:- అధికార బలంతో ప్రజల ఓటు హక్కును, రాజకీయ పార్టీల పోటీ హక్కును కాలరాసి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసిన కూటమి ప్రభుత్వానికి ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి కోరారు. శుక్రవారం ప్రొద్దుటూరులోని రామేశ్వరంలో శ్రీ హనుమత్ లింగేశ్వర స్వామికి వైఎస్సార్‌సీపీ శ్రేణులతో కలిసి ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడిన ఆయన స్థానిక సంస్థల ఎన్నికల్లో జరిగిన పరిణామాలపై విమర్శలు చేశారు.ప్రజలకు ఓటు వేసే అవకాశం కల్పించకుండా ఏకగ్రీవాలు సాధించడం ప్రజాస్వామ్య హక్కులను కాలరాయడమేనని అన్నారు. ప్రొద్దుటూరు నియోజకవర్గంలో సుమారు 2.47 లక్షల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునే అవకాశం కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిపక్ష అభ్యర్థులను పోటీకి దూరం చేసి టీడీపీ నాయకులు, ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి ఏకగ్రీవాలు సాధించారని ఆరోపించారు. అధికార, ఆర్థిక బలంతో పాటు అధికారులను, పోలీసులను ఉపయోగించుకుని ఎన్నికల ప్రక్రియను ప్రభావితం చేశారని విమర్శించారు. 2021లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో తొమ్మిది వార్డులు మాత్రమే ఏకగ్రీవం కాగా, మిగిలిన 32 వార్డులకు ఎన్నికలు నిర్వహించామని గుర్తుచేశారు. అప్పట్లో టీడీపీ అభ్యర్థులు నామినేషన్లు ఉపసంహరించుకున్న విషయాలను ఆ పార్టీ నాయకులను అడిగి తెలుసుకోవాలని సూచించారు. నామినేషన్ల సమయంలో అభ్యర్థులు ఎదుర్కొన్న ఇబ్బందులపై ఎమ్మెల్యే చేసిన వ్యాఖ్యలే వాస్తవ పరిస్థితులను తెలియజేస్తున్నాయని పేర్కొన్నారు.తనకు, పోరెడ్డి నరసింహారెడ్డికి మధ్య విభేదాలు సృష్టించే ప్రయత్నాలు చేయడం బాధాకరమని, తామిద్దరం అన్నదమ్ముల్లాంటి వారమని స్పష్టం చేశారు. పార్టీ కార్యకర్తలను సోదరులుగా భావిస్తానన్నారు. పరిషత్ ఎన్నికల సమయంలో రాజుపాలెంలో రెండు, ప్రొద్దుటూరులో ఐదు నుంచి ఆరు స్థానాలు ఇస్తామని ప్రతిపాదించినా తాము అంగీకరించలేదని తెలిపారు. తాను అధికారంలో ఉన్నా లేకపోయినా ప్రజల తరఫున పోరాటం కొనసాగిస్తానని చెప్పారు.ఎన్నికల సమయంలో కులాలు, ఉపకులాల ప్రస్తావన తీసుకురావడం సరికాదని, కులాల మధ్య చిచ్చుపెట్టే వ్యాఖ్యలు మానుకోవాలని ఎమ్మెల్యేకు హితవు పలికారు. వైఎస్ జగన్ అభ్యర్థులకు కులం ఆధారంగా కాకుండా వారిపై ఉన్న నమ్మకం, అభిమానంతో అవకాశాలు కల్పిస్తారని పేర్కొన్నారు. 2029 ఎన్నికల్లో జగన్ జీరో అవతారన్న ఎమ్మెల్యే వ్యాఖ్యలను తప్పుబడుతూ, జగన్ హీరోగా నిలుస్తారని ధీమా వ్యక్తం



చేశారు.ఉమ్మడి కడప జిల్లాలో టీడీపీకి ప్రజాబలం ఉందని భావిస్తే స్థానిక సంస్థల ఎన్నికల్లో అందరికీ స్వేచ్ఛగా పోటీ చేసే అవకాశం కల్పించి గెలవాలని సవాల్ విసిరారు. 52 మంది కౌన్సిలర్లు ఏకగ్రీవంగా ఎన్నికైనంత మాత్రాన ప్రజల సమస్యలు పరిష్కారమైనట్లు కాదన్నారు. 2014లో నంద్యాల వరదరాజులరెడ్డిపై, 2019లో మల్లెల లింగారెడ్డిపై విజయం సాధించానని గుర్తుచేశారు. రాజకీయాల్లో అంతిమ నిర్ణయం ప్రజలదేనని, రానున్న ఎన్నికల్లో ప్రజల తీర్పే నాయకుల బలాబలాలను నిర్ధారిస్తుందని రాచమల్లు శివప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు.

ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు జరపాలి

ఊళ్లను చెడగొట్టే రాజకీయం చేయొద్దు

ఏజెంట్లను, ఓటర్లను బ్లాక్ చేసి దొంగ ఓట్లు వేసుకోవడానికి స్కెచ్

సీఎంఓ ఆఫీస్ నుంచి డైరెక్షన్

మీడియా సమావేశంలో ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి

పులివెందుల మనప్రగతి అక్టోబర్ 30:- ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికలను జరపాలని, ఊళ్లను చెడగొట్టే విధంగా రాజకీయం చేయొద్దని ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ హౌసింగ్ కాలనీల్లో ఒక్క రూపాయి పనులైనా చేశారా?. పులివెందులకు మెడికల్ కాలేజీ వస్తే మీరే వద్దన్నారు. ఎన్నికల్లో ఇస్తామన్న హామీలు ఏమయ్యాయి అని ,ఈ మూడేళ్లలో ఏం చేశారో చెప్పి ఓట్లు అడగగలరా అంటూ అవినాష్‌రెడ్డి ప్రశ్నించారు.చంద్రబాబు ఎంత బలహీనుడో రాష్ట్రం మొత్తానికి అర్థమైంది. బీటెక్ రవి ప్రచారం వింతగా, ఆశ్చర్యకరంగా ఉంది. ఏ హామీ నెరవేర్చారని టీడీపీ నేతలు ఓట్లు అడుగుతున్నారనీ వైఎస్సార్‌సీపీ కార్పొరేట్, కౌన్సిలర్ అభ్యర్థులను నామినేషన్‌లు వేయకుండా అడ్డుకున్నారు. ప్రచారం కూడా వైఎస్సార్‌సీపీ నేతలను ప్రశాంతంగా చేసుకోనివ్వడం లేదు. ప్రచారంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నేతల ఆస్తులపై దాడులు చేస్తున్నారు. వైఎస్సార్‌సీపీ నేతల ఆస్తులపై దాడులు చేసిన వారికి కనీసం నోటీసులు కూడా ఇవ్వలేదు. పనికి మాలిన పనుల్నీ చంద్రబాబు హయాంలో జరుగుతున్నాయి. ఇలాంటి దాడులు గతంలో ఏనాడూ జరగలేదువేలాది మందిని బయట నుంచి తీసుకొస్తున్నారు. బయట నుంచి వచ్చిన వారికి పోలీసులే సదుపాయాలు కల్పిస్తున్నారు. ఏజెంట్లను, ఓటర్లను బ్లాక్ చేసి దొంగ ఓట్లు వేసుకోవడానికి స్కెచ్. టీడీపీ నీచ ప్రణాళికలకు



కోయ ప్రవీణ్ పూర్తిగా సహకరిస్తున్నాడు. టీడీపీ కుట్రలను ఎస్ఈసీ దృష్టికి వైఎస్సార్‌సీపీ తీసుకెళ్లింది. ఫ్యాక్షనిజాన్ని చంద్రబాబు తట్టి లేపుతున్నాడు. చంద్రబాబు.. నీవు చేసే తప్పుడు పనులు చాలా దూరం వెళ్తాయి' అని వైఎస్ అవినాష్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.ఏజెంట్లను, ఓటర్లను రాకుండా చేసి దొంగ ఓట్లు వేసుకోవడానికి జమ్మలమడుగు, రాయచోటి, కమలాపురం ,పొద్దుటూరు నుంచి మనుషులను తెచ్చుకుని రుకింగ్ చేయాలని చూస్తున్నారన్నారు ఆరోపించారు. స్వేచ్ఛగా ఓటు వేస్తే 80 శాతం వైసీపీ ఓట్లు వస్తాయని వస్తాయని, పులివెందులలో కూటమి నిర్వహించిన బహిరంగ సభతో ఆ పార్టీ బలహీనత రాష్ట్రవ్యాప్తంగా తెలిసిపోయిందని కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి విమర్శించారు. పులివెందుల ప్రజల నుంచి ఆదరణ లేకపోవడంతో జమ్మలమడుగు, కమలాపురం, ప్రొద్దుటూరు తదితర ప్రాంతాల నుంచి జనాలను తరలించాల్సిన పరిస్థితి ఏర్పడిందని అన్నారు. స్థానికంగా ప్రజల మద్దతు లేని కూటమి నేతలు బయట ప్రాంతాల నుంచి జనాలను తీసుకొచ్చి బలప్రదర్శన చేయడం వారి బలహీనతకు నిదర్శనమని పేర్కొన్నారు.పులివెందులలో వైఎస్సార్‌సీపీ ఎన్నికల ప్రచారం నిర్వహించకుండా అడుగడుగునా అడ్డంకులు సృష్టించారని, పార్టీ అభ్యర్థుల బైకులు, వాహనాలను దగ్ధం చేయడంతో పాటు ఆర్థికంగా దెబ్బతీసే ప్రయత్నాలు చేశారని ఆరోపించారు. గతంలో చంద్రబాబు స్థానిక ఎన్నికలకు దూరంగా ఉంటామని ప్రకటించిన తర్వాత టీడీపీ నేతలు నామినేషన్లు వేయడానికి ముందుకు రాలేదని, ఇప్పుడు తమకు నామినేషన్లు వేయనివ్వలేదంటూ వైఎస్సార్‌సీపీపై నిందలు వేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. అడిషనల్ ఎస్పీ, డీఎస్పీ స్థాయి అధికారులు సైతం నామినేషన్లువేయనివ్వబోమని స్పష్టంగా చెప్పినట్లు ఆరోపించారు. 30 నెలల పాలనలో పులివెందులకు మీరు చేసిన అభివృద్ధి ఏమిటో చెప్పాలని ప్రశ్నించారు. ప్రజల వద్దకు వెళ్లి తమ ప్రభుత్వం ఫలానా అభివృద్ధి కార్యక్రమాలు చేసిందని చెప్పుకోలేని పరిస్థితిలో కూటమి నేతలు ఉన్నారని విమర్శించారు.తమ ప్రభుత్వ హయాంలో సుమారు రూ.500 కోట్ల వ్యయంతో నిర్మాణం చేపట్టిన మెడికల్ కాలేజీకి 50 సీట్లు మంజూరైనప్పటికీ వాటిని వెనక్కి పంపిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనని ఆరోపించారు. జగనన్న కాలనీల్లో ఒక్క రూపాయి ఖర్చు చేయకుండా ఇప్పుడు అభివృద్ధి చేస్తామని, ఒక్క అవకాశం ఇవ్వాలని ఏ ముఖం పెట్టుకొని అడుగుతున్నారని ప్రశ్నించారు. గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో కొన్ని ప్రాంతాల్లో పెండింగ్‌లో ఉన్న యూజీడీ పనులను పూర్తి చేయడానికి కూడా ప్రస్తుత ప్రభుత్వం నిధులు ఖర్చు చేయలేకపోయిందని విమర్శించారు.పులివెందుల మున్సిపాలిటీని దొంగల చేతుల్లో పెట్టకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంపీ అవినాష్ రెడ్డి పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీ చైర్‌పర్సన్ అభ్యర్థి వైఎస్ ప్రమీలమ్మతో పాటు 20 వార్డుల్లోని పార్టీ అభ్యర్థులను ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. పులివెందుల అభివృద్ధిని, ప్రజల ప్రయోజనాలను కాపాడాలంటే వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

వైవీయూ అభివృద్ధికి పూర్వ విద్యార్థులు సహకరించాలి

అలుమ్ని అసోసియేషన్‌లో ప్రతి పూర్వ విద్యార్థికి సభ్యత్వం కల్పించాలి

రూ.10 వేల విరాళం అందించిన డాక్టర్ కొప్పోలు రెడ్డి శేఖర్ రెడ్డి

కడప, మన జనప్రగతి, అక్టోబర్ 30:- యోగి వేమన విశ్వవిద్యాలయం పూర్వ విద్యార్థులందరినీ అలుమ్ని అసోసియేషన్‌లో సభ్యులుగా చేర్చాలని విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య బెల్లంకొండ రాజశేఖర్ సూచించారు. శుక్రవారం అలుమ్ని అసోసియేషన్ ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పూర్వ విద్యార్థులు విశ్వవిద్యాలయ అభివృద్ధికి తమ వంతు సహకారం అందించాలని కోరారు.ఈ సందర్భంగా వైవీయూ లలితకళల శాఖ రంగస్థల కళల పూర్వ విద్యార్థి డాక్టర్ కొప్పోలు రెడ్డి శేఖర్ రెడ్డి అలుమ్ని అసోసియేషన్‌కు రూ.10 వేల



విరాళాన్ని చెక్కు రూపంలో ఉపకులపతి ఆచార్య బెల్లంకొండ రాజశేఖర్, రిజిస్ట్రార్ ఆచార్య ఎన్.సి. గంగిరెడ్డి చేతుల మీదుగా అసోసియేషన్ అధ్యక్షుడు ప్రొఫెసర్ విజయకుమార్, అలుమ్ని అసోసియేషన్ కార్యదర్శి డాక్టర్ సురేశ్ యాదవ్, కోశాధికారి డాక్టర్ శశికుమార్ తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ తుమ్మలూరు సురేశ్ బాబుకు అందజేశారు.నవంబర్‌లో విభాగాల వారీగా, డిసెంబర్‌లో విశ్వవిద్యాలయ స్థాయిలో పూర్వ విద్యార్థుల సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించినట్లు ఉపకులపతి తెలిపారు. విరాళం అందించిన డాక్టర్ కొప్పోలు రెడ్డి శేఖర్ రెడ్డిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆచార్య ఎన్. ఈశ్వరరెడ్డి, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ



రెండు లారీలు ఢీకొని డ్రైవర్‌కు తీవ్ర గాయాలు


సిద్ధవటం మన జనప్రగతి అక్టోబర్ 30:-కడపచెన్నై జాతీయ రహదారిపై సిద్ధవటం మండలంలోని జేఎంజే కళాశాల సమీపంలో గురువారం రాత్రి రెండు లారీలు ఢీకొన్న ఘటనలో ఓ లారీ డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు. వివరాల్లోకి వెళితే.. రేణిగుంట నుంచి నాగ్‌పూర్‌కు ఇనుము లోడుతో వెళ్తున్న లారీ, పూణే నుంచి ఉల్లిపాయల లోడుతో వస్తున్న మరో లారీ జేఎంజే కళాశాల సమీపంలో ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్ షేక్ అంజాద్ భాష ఎడమ కాలుకు బలమైన గాయాలై రక్తస్రావమైంది. వెంటనే స్పందించిన స్థానికులు క్షతగాత్రుడిని 108 అంబులెన్స్‌లో కడప రిమ్స్‌కు తరలించారు. అక్కడ వైద్యులు ప్రాథమిక చికిత్స అందించిన అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూలు ఆసుపత్రికి తరలించారు. ప్రమాద సమాచారం తెలుసుకున్న సిద్ధవటం మండల ఎస్సై హారిక ఘటనాస్థలానికి చేరుకుని ప్రమాదంపై విచారణ చేపట్టారు. ఈ ఘటనలో స్థానిక పోలీసులు పాల్గొని వివరాలు సేకరించారు.

వెంకటయ్య వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు



సిద్ధవటం మన జనప్రగతి అక్టోబర్ 30:-మండలంలోని మాధవరం-1 గ్రామ పంచాయతీ పరిధిలోని పార్వతిపురం ఎస్సీబీవీడీ సభ ఎలిమెంటరీ అండ్ హైస్కూల్‌లో పాఠశాల వ్యవస్థాపకులు, అధ్యక్షులు, ఉప్పరపల్లికి చెందిన శ్రీ మేరువ దాసయ్యగారి వెంకటయ్య వర్ధంతి కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ ఎం.డి. మధుసూదన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు వెంకటయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మేనల్లుడు కాసల సుబ్బయ్య మాట్లాడుతూ వెంకటయ్య విద్యాభివృద్ధికి, సమాజ సేవకు చేసిన కృషిని గుర్తుచేసుకున్నారు. ఆయన ఆశయాలను కొనసాగించాలని విద్యార్థులకు సూచించారు.

రేపు రాయచోటిలో ఉచిత కంటి వైద్య శిబిరం



రాయచోటి మన జనప్రగతి అక్టోబర్ 30:- లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ ఆధ్వర్యంలో శ్రీ వెంకటేశ్వర అరవింద్ కంటి ఆసుపత్రి, తిరుపతి సౌజన్యంతో రేపు (నవంబర్ 1) ఆదివారం రాయచోటిలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు క్యాంప్ ఆర్గనైజర్ లయన్ పి.ఎస్. హరినాథ్ రెడ్డి తెలిపారు. హరినాథ వీధిలోని రాయచోటి మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు శిబిరం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.ఈ శిబిరంలో దగ్గర చూపు, దూరపు చూపు సమస్యలకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహిస్తారు. కంటి పొర, కంటి శుక్లాలు ఉన్నవారిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేసి అదే రోజు తిరుపతిలోని అరవింద్ కంటి ఆసుపత్రికి తీసుకెళ్తారు. అక్కడ ఉచిత భోజనం, వసతి కల్పించడంతోపాటు కంటి శస్త్రచికిత్సలు నిర్వహిస్తారు. చికిత్స అనంతరం రెండు రోజుల తర్వాత తిరిగి రాయచోటికి తీసుకువస్తారు.బీపీ, మధుమేహం ఉన్నవారు వాటిని నియంత్రణలో ఉంచుకుని సంబంధిత వైద్యుల ధ్రువీకరణ పత్రం, వాడుతున్న మందుల వివరాలతో రావాలని సూచించారు. కంటి అద్దాలు అవసరమైన వారికి తక్కువ ధరకు అందిస్తారు. గ్లాకోమా, రెటీనా, కార్నియా తదితర సమస్యలు ఉన్నవారికి తదుపరి పరీక్షలు, చికిత్సలపై వైద్య సలహాలు అందిస్తారు. శిబిరానికి వచ్చేవారు ఆధార్ కార్డు జిరాక్స్, ఫోన్ నంబర్ తప్పనిసరిగా తీసుకురావాలని కోరారు.మరిన్ని వివరాలకు లయన్ పి.ఎస్. హరినాథ్ రెడ్డి 9701078269, లయన్ మిక్కిలినేని ప్రసాద్ నాయుడు 9000890990 నంబర్లను సంప్రదించవచ్చు. ఈ కార్యక్రమానికి లయన్ ఎస్. రామాంజనేయ రెడ్డి అధ్యక్షులుగా, లయన్ ఇందాద్ అహమ్మద్ కార్యదర్శిగా, లయన్ శ్రీనివాసులు (భూపతి) కోశాధికారిగా వ్యవహరిస్తున్నారు.

ప్రజాస్వామ్య పరిరక్షణకు ప్రవాసాంధ్రులు కృషి చేయాలి

- గల్ఫ్‌లోని ప్రవాసాంధ్రులు తమ కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు ఓటు వేయాలని కోరండి
- వైఎస్ఆర్సిపి గల్ఫ్ కన్వీనర్ ఇలియాస్ బిహెచ్



కడప మన జనప్రగతి అక్టోబర్ 30: ఆంధ్రప్రదేశ్‌లో రాజ్యాంగ విలువలను, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గల్ఫ్ కన్వీనర్ పిలుపునిచ్చారు.నవంబర్ 1,2026న జరగనున్న మున్సిపాలిటీ, కార్పొరేషన్ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు మద్దతుగా నిలవాలని గల్ఫ్ దేశాల్లో నివసిస్తున్న ప్రవాసాంధ్రులకు విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా ఇలియాస్ బి.హెచ్., ఎన్నారై గాలివీటి ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో జరుగుతున్న స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా అధికార కూటమి ప్రభుత్వం ప్రతిపక్ష అభ్యర్థులను నామినేషన్లు వేయకుండా అడ్డుకోవడం,బెదిరింపులకు పాల్పడటం,దౌర్జన్యాలకు దిగడం వంటి ఘటనలు ప్రజాస్వామ్యానికి విరుద్ధమని విమర్శించారు.ఎన్నికల సమయంలో ఇలాంటి పరిణామాలు చోటుచేసుకోవడం తీవ్రంగా ఖండించదగిన విషయమని పేర్కొన్నారు.ప్రజాస్వామ్య పరిరక్షణతో పాటు పేద ప్రజల హక్కులను కాపాడుకోవడానికి ప్రవాసాంధ్రులు కూడా తమ వంతు బాధ్యతగా ముందుకు రావాలని కోరారు. గల్ఫ్ దేశాల్లో నివసిస్తున్న ప్రతి ప్రవాసాంధ్రుడు తమ స్వగ్రామాల్లోని కుటుంబ సభ్యులు,బంధువులు,మిత్రులకు ఫోన్ చేసి ఎన్నికల ప్రాధాన్యతను వివరించాలని సూచించారు.స్వేచ్ఛాయుత పాలన,ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ కోసం నవంబర్ 1న జరిగే మున్సిపాలిటీ,కార్పొరేషన్ ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని వారు పత్రికా ప్రకటన ద్వారా విజ్ఞప్తి చేశారు.

సైకిల్ గుర్తుతో ప్రజల్లోకి మద్దతు కోరుతూ.. టీడీపీ ఎంపీటీసీ అభ్యర్థి,సుశీల ప్రచారం

- సైకిల్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థన



బొమ్మనహాల్ మన జనప్రగతి అక్టోబర్ 30 :-బొమ్మనహాల్ మండల సింగేపల్లి గ్రామ తెలుగుదేశం పార్టీ ఎంపీటీసీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న సుశీల గ్రామంలో పెద్దా ఎత్తున అభిమాన నాయకులతో కలసి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు,ప్రచారంలో భాగంగా ముందుగా గ్రామంలోని సంగమేశ్వర స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ప్రజలను కలుసుకుంటూ ప్రచార కార్యక్రమం చేపట్టారు,ఈ సందర్భంగా గ్రామ ప్రజలతో మమేకమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు, గ్రామాల్లో నెలకొన్న సమస్యలు, అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలపై ప్రజలతో చర్చించారు, ఎంపీటీసీ అభ్యర్థి సుశీల మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు,ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్,స్థానిక ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు నాయకత్వంలో గ్రామాలను అభివృద్ధి పథంలో ఇంకా ముందుకు నడిపించేందుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు, గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి,అభివృద్ధి కార్యక్రమాల అమలుకు సహాయ సహకారాలు అందిస్తూ ప్రజలకు అందుబాటులో ఉంటానని పేర్కొన్నారు,రానున్న ఎంపీటీసీ, ఎన్నికల్లో భాగంగా నవంబర్ 5వ తేదీన జరగనున్న ఎన్నికల్లో తనకు సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని గ్రామ ప్రజలను అభ్యర్థించారు,ప్రజల ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తూ గ్రామాల అభివృద్ధికి కట్టుబడి ఉంటానని పేర్కొన్నారు,ఈ కార్యక్రమంలో జగన్నాథ రెడ్డి,కేశవరెడ్డి, బొంబాయి ఈరన్న,డీలర్ వన్నురుస్వామి,రామకృష్ణ, రమేష్,యల్లప్ప,మరియు అభిమాన నాయకులు, కార్యకర్తలు,యువకులు పాల్గొన్నారు.

బాల్రెడ్డిపల్లిలో టిడిపి పార్టీ ఇంటింటా ప్రచారం

- ఎంపీటీసీ, జడ్పిటిసి సభ్యులను గెలిపించాలి
- కూడా చైర్మన్ టిడిపి ఇన్చార్జి ముక్కారూపానంద రెడ్డి.



ఓబులవారిపల్లి మన జనప్రగతి అక్టోబర్ 30:-తిరుపతి జిల్లా రైల్వే కోడూరు నియోజకవర్గంలోని ఓబులవారిపల్లి మండలం బాల్రెడ్డిపల్లి పంచాయతీలో కూటమి తరుపున టిడిపి ఎంపీటీసీ అభ్యర్థి గజ్జల వెంకటకృష్ణారెడ్డి, జడ్పిటిసి సభ్యురాలు కీర్తి పార్టీ కవితను. మీ అమూల్యమైన ఓటు వేసి అఖండ మెజారిటీతో గెలిపించాలని వారు గ్రామంలో ఇంటింటా తిరిగి ప్రచారం నిర్వహించారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తూ అన్ని విధాల ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం పాటుపడుతుందని ఆయన అన్నారు ఈ స్థానిక సంస్థల ఎన్నికలలో కూటమి ప్రభుత్వం విజయం సాధిస్తే రాబోవు రోజులలో అన్ని గ్రామ పంచాయతీలు అంచలంచలుగా అభివృద్ధి సాధించడం జరుగుతుందన్నారు ఈ కార్యక్రమంలో యువ నాయకులు ఒక్కసారి వికాసిరెడ్డి వాసుదేవ రెడ్డి, వల్లి సాహెబ్, రవిచంద్ర రెడ్డి బత్తిన వేణుగోపాల్ రెడ్డి స్థానిక కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

వేంపల్లెలో ఘనంగా సంకటహర చతుర్థి వేడుకలు



వేంపల్లె మన జన ప్రగతి అక్టోబర్ 30: వేంపల్లెలో గణనాధునికి సంకటహర చతుర్థి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రథమ పూజలు అందుకునే మహా గణపతికి ఆర్యవైశ్య మహిళా మండలి వారు 21 నెలల సంకట హర చతుర్థి పూజలు చేయాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా మెయిన్ బజార్ లోనే వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో ఆర్యవైశ్య మహిళా మండలి ఆధ్వర్యంలో అర్చకుడు ఇంద్రకంటి ప్రసాద శర్మ నేతృత్వంలో వినాయకునికి అభిషేకం, అర్చన, గరికతో అష్టోత్తరం, కథాశ్రవణం ,సామూహిక సంకటహర చతుర్థి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య మహిళా మండలి అధ్యక్షురాలు బచ్చు భాగ్యేశ్వరమ్మ, ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు చంద్రశేఖర్, యువజన సంఘం, అధ్యక్షుడు రాయవరం సుబ్బారావు, వాసవి కళ్యాణ మండపం సభ్యులు, మహిళా మండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కాకినాడ మేయర్ సీటు చేనేతలకు ఇవ్వాలి



కాకినాడ మన జనప్రగతి అక్టోబర్ 30:రాష్ట్రంలో సుమారు 40 అసెంబ్లీ నియోజకవర్గాలలో చేనేత సామాజిక వర్గాల ఓటర్ల ప్రభావం అధికంగా ఉందని వారు వేసిన ఓట్లతో అక్కడి నేతలు ప్రజా ప్రతినిధులుగా ఎన్నికవుతున్నారని అందువల్ల కాకినాడ మేయర్ సీటును చేనేత వర్గానికి కేటాయించాలని చేనేత కులాలకు చెందిన నాయకులు కూటమి ప్రభుత్వాన్ని కోరారు.ఈ సందర్భంగా కాకినాడ మేయర్ బీసీ మహిళకు రిజర్వ్ అయినందువల్ల విద్యావంతురాలైన జాగు హారిక అనే యువతికి ఈ మేయర్ సీటును కేటాయించాలని వారు సూచించారు. ఈ సందర్భంగా చేనేత సామాజిక వర్గాలకు చెందిన నాయకులు శుక్రవారం చేనేత కులాలకు చెందిన ప్రతినిధులు కొల్లి వెంకటేశ్వరరావు, పప్పు దుర్గా రమేష్, పొన్నగంటి సత్యనారాయణ,కడారి భవాని,పచ్చారి నాగేశ్వరరావులు శుక్రవారం విలేకరులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు.రాష్ట్రంలో తమకు సామాజిక వర్గం అధికంగా ఓటర్లు ఉన్న మంగళగిరి,పిఠాపురం,ధర్మవరం,ఎమ్మిగనూరు,వెంకటగిరి,చీరాల,మదనపల్లి,రాజమహేంద్రవరంలలో అక్కడ పోటీ చేసిన కూటమి పార్టీల ప్రజాప్రతినిధులను అత్యధిక మెజార్టీతో గెలిపించారన్నారు.త్యాగాలు చేసిన తమకు న్యాయం చేస్తామని కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చిందని ఆ హామీలో భాగంగా కాకినాడ మేయర్ సీటును ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తున్నట్లు వారు చెప్పారు. రాష్ట్రంలో మున్సిపల్ చైర్మన్, మేయర్ సీట్లు రిజర్వ్ కావడంతో సామాజిక వర్గంకు దక్కక పోవడంతో కాకినాడ మేయర్ సీటు ఇవ్వాలని తాము కోరుతున్నట్లు చెప్పారు. మీరు సీటు హారికకి ఇచ్చి తమను గౌరవించాలని వెంకటేశ్వరరావు, రమేష్, రామకృష్ణ, సత్యనారాయణ, నాగేశ్వర రావులు కూటమి ప్రభుత్వాన్ని కోరారు.ఈ సమావేశంలో చేనేత నాయకులు పలివెల లక్ష్మి, అముజూరి భాస్కర్, వి శివాజీ గణేష్, కడారి మధు తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ కిచెన్‌లో డీఈఓ ఆకస్మిక తనిఖీ

- విద్యార్థులకు నాణ్యమైన,రుచికరమైన భోజనం అందించాలి
- ఆహార తయారీ,పంపిణీలో అప్రమత్తంగా ఉండాలి



సిద్ధవటం మన జనప్రగతి అక్టోబర్ 30:-మండల కేంద్రమైన సిద్ధవటంలోని స్మార్ట్ కిచెన్ కేంద్రాన్ని శుక్రవారం జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ) షంషుద్దీన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వంటశాల పరిసరాలు, భోజన తయారీ విధానం, విద్యార్థులకు అందిస్తున్న ఆహార నాణ్యతను పరిశీలించారు. వంటశాల పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవడంతోపాటు విద్యార్థులకు ప్రతిరోజూ నాణ్యమైన, రుచికరమైన భోజనం అందించాలని సిబ్బందికి సూచించారు.ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల ఆరోగ్యం, పోషకాహారానికి ప్రాధాన్యతనిస్తూ ప్రతిష్టాత్మకంగా స్మార్ట్ కిచెన్ కేంద్రాలను ఏర్పాటు చేసిందన్నారు. ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా ప్రతి విద్యార్థికి పరిశుభ్రమైన వాతావరణంలో నాణ్యమైన ఆహారం అందించాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందని పేర్కొన్నారు. గత గురువారం చోటుచేసుకున్న సంఘటనలు పునరావృతం కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ఆహార పదార్థాల తయారీ నుంచి విద్యార్థులకు పంపిణీ చేసే వరకు ప్రతి దశలో అప్రమత్తంగా వ్యవహరించాలని ఆదేశించారు.ఈ తనిఖీలో కడప డీఆర్డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ ప్రసాద్, మండల విద్యాశాఖ అధికారి అరుణ, ఏపీఎం సుజాత, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సునీత, స్మార్ట్ కిచెన్ కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామ అభివృద్ధే లక్ష్యం..ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

- టీడీపీ ఎంపీటీసీ అభ్యర్థి, సరోజమ్మ



బొమ్మనహాల్ మన జనప్రగతి అక్టోబర్ 30:-బొమ్మనహాల్ మండల పరిధిలో శ్రీధరఘట్ట గ్రామంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కృషి చేస్తానని తెలుగుదేశం పార్టీ ఎంపీటీసీ అభ్యర్థి సరోజమ్మ తెలిపారు,గ్రామ అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు,గ్రామ ప్రజలతో సన్నిహితంగా ఉంటూ వారి సమస్యలను తెలుసుకొని,వాటి పరిష్కారానికి కృషి చేస్తానని వెల్లడించారు,ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా కృషి చేస్తూ గ్రామంలో నెలకొన్న సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు నిరంతరం పనిచేస్తానని తెలిపారు,ప్రజల ఆదరాభిమానాలతో ఎంపీటీసీగా గెలిపిస్తే శ్రీధరఘట్ట గ్రామ అభివృద్ధికి పెద్దపీట వేస్తూ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని ప్రస్తుతం జరగబోయే ఎంపీటీసీ ఎన్నికలలో తెలుగుదేశం పార్టీకి సైకిల్ గుర్తుకు ఓటు వేసి వేయించి తెలుగుదేశం ఎంపీటీసీ అభ్యర్థి,సరోజమ్మ నన్ను ఆశీర్వదించాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల కన్వీనర్ బలరాం రెడ్డి,మాజీ ఎంపీటీసీ తిప్పేస్వామి,బీసీ సాధికార జిల్లా అధ్యక్షుడు సాగర రవిచంద్ర, మరియు తెలుగుదేశం పార్టీ అభిమాన నాయకులు, కార్యకర్తలు,యువకులు, పాల్గొన్నారు.

నవంబర్ 1 నుంచి ముఖ హాజరు తప్పనిసరి

- మున్సిపల్ కమీషనర్ జ్యోతిక శ్రీనివాస విశ్వనాథ్



ప్రొద్దుటూరు మన జనప్రగతి అక్టోబర్ 30:- నవంబర్ 1నుంచి మున్సిపల్ శానిటేషన్ సిబ్బందికి, కార్మికులకు ముఖ హాజరు తప్పనిసరని కమీషనర్ తూతిక శ్రీనివాస విశ్వనాధ్ తెలిపారు. ఇప్పటికే మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ కి ఆదేశాలు జారీ చేస్తూ మున్సిపాలిటీ పరిధిలో ఉన్నా పారిశుధ్య కార్మికులను, నగరదీపిక, సులభ్ కాంప్లెక్స్ సిబ్బందిని, అపకాస్ సిబ్బందిని ముఖ హాజరు పరిధిలోకి తీసుకు రావాలని సూచించారు. రానున్న రోజులలో ముఖ హాజరు ద్వారానే సిబ్బందికి జీతాలు ఇవ్వడం జరుగుతుందని కమీషనర్ తెలిపారు. ప్రభుత్వం నుంచి జీతాలు తీసుకుంటున్న సిబ్బందికి హాజరు తప్పనిసరని, సిబ్బంది సమయపాలన పాటిస్తే మెరుగైన సేవలు ప్రజలకు అందించవచ్చని కమీషనర్ అన్నారు. పట్టణంలో పారిశుధ్య నిర్వహణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వడంతో పాటుగా మున్సిపల్ సేవలు ప్రజలకు చేరువ చేయడమే సిబ్బంది ముఖహాజరు లక్ష్యమని కమీషనర్ తూతిక శ్రీనివాస విశ్వనాధ్ తెలిపారు.

రామసముద్రంలో టిడిపి నాయకులు విస్తృత ప్రచారం

● ఎంపీటీసీ అభ్యర్థి మల్లికార్జున రెడ్డి. జడ్పిటిసి అభ్యర్థి సుభాష్ రెడ్డిని గెలిపించండి ● ఎమ్మెల్యే అరవ శ్రీధర్,ముక్కా వరలక్ష్మీ లు.



ఓబులవారిపల్లి మన జనప్రగతి అక్టోబర్ 30:-కూటమి ఎంపీటీసీ. జడ్పిటిసి సభ్యులు ను స్థానిక సంస్థల్లో గెలిపించాలని టిడిపి ఇన్చార్జి కూడా చైర్మన్ ముక్కారూపానంద రెడ్డి సతీమణి ముఖా వరలక్ష్మి మరియు ఎమ్మెల్యే అరవ సోదరులు మద్దతుగా శుక్రవారం పుల్లంపేట మండలంలోని దేవసముద్రంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంపీటీసీ సభ్యులు మల్లికార్జునరెడ్డిని అలాగే జడ్పిటిసి అభ్యర్థి ముద్దా సుభాష్ రెడ్డిని గెలిపించాలని వారు సూచించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రైల్వే కోడూరు నియోజకవర్గం అంచలంచలుగా అభివృద్ధి సాధించిందని ఈ స్థానిక సంస్థలలో కూటమి తరుపున ఎంపీటీసీలు జడ్పీటీసీలు విజయం సాధిస్తే అన్ని విధాల రైల్వే కోడూరు నియోజకవర్గం అన్ని రంగాలలో అభివృద్ధి సాధిస్తుందన్నారు అంతే కాకుండా రాష్ట్ర ప్రభుత్వం మన నియోజకవర్గానికి కోట్లాది రూపాయలు మంజూరు చేసి అభివృద్ధి పనులు చేపడుతుందన్నారు ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకొని . కూటమి తరుపున నిలబడ్డ ఎంపీటీసీ జడ్పిటిసి లను మీ అమూల్యమైన ఓటును వేసి అఖండ మెజారిటీతో విజయం సాధించాలని చింతా ప్రచారంలో వారు ఓటరు.మహాశయులను కోరారు ఈ కార్యక్రమంలో పుల్లంపేట కూటమి నాయకులు కార్యకర్తలు సీనియర్లు మండల టిడిపి నాయకులు చంద్రశేఖర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు

గద్దరేవులపల్లిలో ముక్కా రూపానంద రెడ్డి విస్తృత ప్రచారం



ఓబులవారిపల్లి మన జనప్రగతి అక్టోబర్ 30:-ఓబులవారిపల్లి మండలం గద్దరేవులపల్లి గ్రామంలో రైల్వే కోడూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ బాధ్యులు, కడప పట్టణాభివృద్ధి సంస్థ చైర్మన్ ముక్కా రూపానంద రెడ్డి కూటమి అభ్యర్థులతో కలిసి విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామంలోని వివిధ ప్రాంతాల్లో పర్యటిస్తూ ప్రజలను నేరుగా కలుసుకున్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులకు మద్దతు తెలిపి విజయానికి కృషి చేయాలని ఓటర్లను కోరారు. గద్దరేవులపల్లి గ్రామంలో కూటమి బలపరిచిన ఎంపీటీసీ అభ్యర్థి సిరిగిరాజు సౌజన్య, జడ్పీటీసీ అభ్యర్థి కీర్తిపాటి కవితలకు మద్దతుగా ముక్కా రూపానంద రెడ్డి ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామంలోని వీధుల్లో పర్యటిస్తూ స్థానిక ప్రజలు, మహిళలు, యువతను కలుసుకుని వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామ అభివృద్ధి, ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు, స్థానికంగా నెలకొన్న సమస్యలపై ప్రజలతో చర్చించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎంపీటీసీ, జడ్పీటీసీ సభ్యుల పాత్ర కీలకమని, గ్రామాల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు నిరంతరం కృషి చేయాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి, వారి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి బాటలు వేయవచ్చన్నారు. కూటమి అభ్యర్థులకు ప్రజల మద్దతు లభించేలా పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ముక్కా రూపానంద రెడ్డి గ్రామంలో పర్యటిస్తూ ఓటర్లను కలుసుకోవడంతో ఎన్నికల ప్రచారానికి ప్రాధాన్యత సంతరించుకుంది. కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహించారు. స్థానిక సమస్యలను తెలుసుకుంటూ ప్రజలకు చేరువయ్యే ప్రయత్నం చేశారు. ఈ ప్రచార కార్యక్రమంలో స్థానిక టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కూటమి శ్రేణులు, కార్యకర్తలు పాల్గొని అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం నిర్వహించారు.

మార్కాపురం అభివృద్ధే లక్ష్యంగా

బీసీవై పార్టీ నుంచి పోటీ

- చైర్మన్ అభ్యర్థిగా డాక్టర్ కిరణ్ కుమార్ విజ్ఞప్తి



మార్కాపురం, మన జనప్రగతి అక్టోబర్ 30:- మార్కాపురం మున్సిపాలిటీ చైర్మన్ అభ్యర్థిగా బీసీవై పార్టీ తరఫున పోటీ చేస్తున్న డాక్టర్ కిరణ్ కుమార్ పట్టణ ప్రజలను ఓటు అభ్యర్థించారు. తన తాత డాక్టర్ వెంకటేశ్వర్లు స్ఫూర్తితో కుటుంబం ఎన్నో ఏళ్లుగా కొనసాగిస్తున్న సేవా కార్యక్రమాలను మరింత విస్తరించడంతో పాటు మార్కాపురం అభివృద్ధికి కృషి చేయాలనే సంకల్పంతో ఎన్నికల బరిలో నిలిచినట్లు తెలిపారు.బోడె రామచంద్ర యాదవ్ స్థాపించిన బీసీవై పార్టీ అన్ని వర్గాల మద్దతుతో అభివృద్ధి చెందుతూ ప్రజాసేవ లక్ష్యంగా పనిచేస్తోందన్నారు. మార్కాపురం పట్టణంలోని సమస్యలపై తనకు అవగాహన ఉందని, చైర్మన్‌గా అవకాశం కల్పిస్తే వాటి పరిష్కారానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని పేర్కొన్నారు.రానున్న మున్సిపల్ ఎన్నికల్లో టార్చ్‌లైట్ గుర్తుపై ఓటు వేసి తనను చైర్మన్‌గా గెలిపించాలని డాక్టర్ కిరణ్ కుమార్ పట్టణ ప్రజలను కోరారు.

మున్సిపల్ పాలనలో మూడో తరంలోకి కామిశెట్టి కుటుంబం



ప్రొద్దుటూరు మన జనప్రగతి అక్టోబర్ 28:-ప్రొద్దుటూరు పురపాలక సంఘం పాలకమండలిలో కామిశెట్టి కుటుంబం లోని మూడో తరం అడుగుపెట్టింది. ప్రొద్దుటూరు పట్టణ రాజకీయాల్లో కామిశెట్టి కుటుంబం మూడు తరాలుగా తనదైన ముద్ర వేసుకుంటే ప్రజాసేవలో మున్సిపల్ చైర్మన్‌గా తొలి తరం స్వర్గీయ కామిశెట్టి సుబ్బారావు, వైస్ చైర్మన్‌గా కామిశెట్టి బాబు రెండో తరం బాధ్యతలు నిర్వహించగా, ప్రస్తుతం మూడో తరానికి చెందిన కామిశెట్టి కృష్ణమూర్తి తనయుడు కామిశెట్టి సుబ్బ రవితేజ కౌన్సిలర్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. దీంతో మున్సిపల్ పాలనలో మూడు తరాలుగా కొనసాగుతున్న కామిశెట్టి కుటుంబ ప్రస్థానం మరో ముందడుగు వేసింది. ప్రముఖ వ్యాపారవేత్త స్వర్గీయ కామిశెట్టి సుబ్బారావు తొలి తరంలో ప్రొద్దుటూరు మున్సిపల్ చైర్మన్‌గా తనదైన పాలన కొనసాగించి ప్రజాభిమానం పొందడంలో సఫలీకృతులయ్యారు. పట్టణ రాజకీయాల్లో తనదైన గుర్తింపు పొందిన ఆయన కుటుంబం నుంచి రెండో తరానికి చెందిన కామిశెట్టి సుబ్రహ్మణ్యం అలియాస్ బాబు మున్సిపల్ వైస్ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించారు. ఇలా ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు వేర్వేరు తరాల్లో మున్సిపల్ పాలనలో కీలక బాధ్యతలు చేపట్టడం విశేషంగా నిలిచింది.ప్రస్తుతం మూడో తరానికి చెందిన యువకులు విద్యావంతులు ఎంబీఏ పూర్తి చేసిన కామిశెట్టి కృష్ణమూర్తి తనయుడు కామిశెట్టి సుబ్బ రవితేజ కౌన్సిలర్‌గా ఏకగ్రీవంగా ఎన్నిక కావడంతో కుటుంబ రాజకీయ ప్రస్థానం కొనసాగుతోంది. చైర్మన్‌గా, వైస్ చైర్మన్‌గా గత తరాలు బాధ్యతలు నిర్వహించగా, ఇప్పుడు కౌన్సిలర్‌గా మూడో తరం ప్రజాప్రతినిధిగా అడుగుపెట్టడం పట్టణంలో చర్చనీయాంశంగా మారింది.మూడు తరాలుగా మున్సిపల్ రాజకీయాలతో అనుబంధం కొనసాగిస్తున్న కామిశెట్టి కుటుంబం ఎన్నికల ద్వారా ప్రజాప్రతినిధులుగా బాధ్యతలు చేపట్టడం పట్ల పలువురు అభినందనలు తెలియజేస్తున్నారు. కుటుంబంలోని కొత్త తరం కూడా ప్రజా జీవితంలోకి రావడంతో పట్టణ ప్రజలకు సేవలందించే అవకాశం మరింత విస్తరించాలని వారు ఆకాంక్షిస్తున్నారు.

అభయ ఆంజనేయ స్వామి విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవం





సిద్ధవటం మన జనప్రగతి అక్టోబర్ 30:-కడపచెన్నై జాతీయ రహదారిపై బొగ్గిడి వారిపల్లె పంచాయతీ పరిధిలోని గంగానగర్ గ్రామంలో శుక్రవారం అభయ ఆంజనేయ స్వామి ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠ, విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు సురేష్ కుమార్ శర్మ మాట్లాడుతూ.. పరాభవ నామ సంవత్సర పంచమి శుక్రవారం సందర్భంగా అభయ ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠను పురస్కరించుకుని యంత్ర ప్రతిష్ఠ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ, పూర్ణాహుతి, కలశ పూజ, అగ్ని హోమాలు, యంత్ర హోమం తదితర విశేష పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించినట్లు తెలిపారు. ఆలయ అభివృద్ధికి చాముండేశ్వరి పేట గ్రామానికి చెందిన పుల్లారెడ్డి, మాచుపల్లి గ్రామానికి చెందిన మల్లు పెద్ద వెంకట సుబ్బారెడ్డి తదితరులు సహకారం అందించారని పేర్కొన్నారు. ఆలయ నిర్మాణానికి సహకరించిన దాతలను గ్రామస్తులు సంప్రదాయబద్ధంగా ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు అన్నప్రసాద వితరణ చేపట్టారు. ఈ వేడుకల్లో గ్రామస్తులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక శోభతో హొన్నూరు

దర్గా..నేడు భక్తిశ్రద్ధలతో దేవుని సవారి



బొమ్మనహాల్ మన జనప్రగతి అక్టోబర్ 30 :-మండల పరిధిలో దర్గా హొన్నూరు గ్రామంలో ప్రతి ఏటా నిర్వహించే స్వామి 348 వ దర్గా ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి,ఉత్సవాల్లో ప్రధాన ఘట్టమైన దేవుని సవారి నేడు భక్తిశ్రద్ధలతో దర్గాకు చేరుకోనుంది,ఈ సందర్భంగా గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది,ఆంధ్ర,తెలంగాణ, కర్ణాటక,ప్రాంతాల నుంచి భక్తులు బందుమిత్రులు కుటుంబ సమేతంగా పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకోనున్నారు,దర్గా పరిసరాల్లో విద్యుత్ దీపాలు, పూల అలంకరణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి, సవారి మార్గంలో భక్తులు పూలతో స్వాగతం పలుకుతుండగా, డప్పుల మోతలు,భక్తి గీతాలతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది, ఉత్సవాల సందర్భంగా ప్రజలకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సర్కిల్ ఇన్స్పెక్టర్ వెంకటరమణ పర్యవేక్షణలో ఐదుగురు సబ్ ఇన్స్పెక్టర్లు,దాదాపుగా 50 మందికి పైగా పోలీసు సిబ్బందితో ముందస్తు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. భద్రతా ఏర్పాట్లను పోలీసులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. గ్రామ పెద్దలు భక్తుల సౌకర్యార్థం తాగునీరు,రహదారి లైటింగ్ తదితర ఏర్పాట్లు చేశారు.

హెచ్‌పీవీ టీకాతో గర్భాశయ క్యాన్సర్ నివారణ



చిట్వేలి మన జనప్రగతి అక్టోబర్ 30:-గర్భాశయ క్యాన్సర్‌ను నివారించడంలో హెచ్‌పీవీ (హ్యూమన్ పాపిలోమా వైరస్) వ్యాక్సిన్ ఎంతో ఉపయోగకరమని చిట్వేలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ శివప్రసాద్ గౌడ్ తెలిపారు. మండల పరిధిలో 14 సంవత్సరాలు నిండి, 15 సంవత్సరాల లోపు వయస్సు ఉన్న బాలికలందరూ హెచ్‌పీవీ వ్యాక్సిన్ వేయించుకోవాలని ఆయన సూచించారు. చిట్వేలి పట్టణంలోని శ్రీ సాయి వికాస్ ఉన్నత పాఠశాలలో పాఠశాల కరస్పాండెంట్ రెడ్డయ్య నాయుడు పర్యవేక్షణలో విద్యార్థినులకు హెచ్‌పీవీ వ్యాక్సినేషన్‌పై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఈఓ ధనలక్ష్మి, హెల్త్ సూపర్వైజర్ ఇస్మాయిల్ బాషా పాల్గొని బాలికలకు వ్యాక్సిన్ ప్రాధాన్యతను వివరించారు. గర్భాశయ క్యాన్సర్ ముప్పును తగ్గించడంలో హెచ్‌పీవీ వ్యాక్సిన్ కీలక పాత్ర పోషిస్తుందని, అర్హత కలిగిన బాలికలు నిర్దిష్ట వయస్సులోనే టీకా వేయించుకోవడం ద్వారా భవిష్యత్తులో ఆరోగ్య సమస్యల ముప్పును తగ్గించుకోవచ్చని అవగాహన కల్పించారు. చిట్వేలి మండల పరిధిలో 14 సంవత్సరాలు నిండి, 15 సంవత్సరాల లోపు వయస్సు ఉన్న బాలికల్లో ఇప్పటివరకు హెచ్‌పీవీ వ్యాక్సిన్ వేయించుకోని వారు చిట్వేలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చి టీకా వేయించుకోవాలని డాక్టర్ శివప్రసాద్ గౌడ్ కోరారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అర్హులైన బాలికల తల్లిదండ్రులు ఈ విషయాన్ని గమనించి, తమ పిల్లలకు వ్యాక్సిన్ వేయించేందుకు ముందుకు రావాలని సూచించారు. బాలికల ఆరోగ్య పరిరక్షణకు, గర్భాశయ క్యాన్సర్ నివారణపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు వైద్య ఆరోగ్య శాఖ చేపడుతున్న కార్యక్రమాలకు తల్లిదండ్రులు సహకరించాలని వైద్యాధికారి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ సాయి హైస్కూల్ కరస్పాండెంట్ రెడ్డయ్య నాయుడు, ఉపాధ్యాయులు దొండ్లవాగు శ్రీనివాసులు, హెచ్‌ఈఓ ధనలక్ష్మి, హెల్త్ సూపర్వైజర్ ఇస్మాయిల్ బాషా పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పులిగోరు మురళీకృష్ణారెడ్డి ప్రచారం



తిరుపతి, మన జనప్రగతి, అక్టోబర్ 30:-తిరుపతి కార్పొరేషన్ ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా టీడీపీ మూడో క్లస్టర్ ఇన్‌చార్జి, తిరుపతి కోఆపరేటివ్ బ్యాంక్ మాజీ చైర్మన్ పులిగోరు మురళీకృష్ణారెడ్డి నేతృత్వంలో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. 21, 22, 41, 42, 43 డివిజన్లలో ఇంటింటికీ వెళ్లి మేయర్ అభ్యర్థి జేబీ శ్రీనివాస్‌తో పాటు కూటమి కార్పొరేటర్ అభ్యర్థులను గెలిపించాలని ఓటర్లను కోరారు.తిరుపతి అభివృద్ధి మరింత వేగవంతం కావాలంటే జేబీ శ్రీనివాస్‌ను మేయర్‌గా గెలిపించాలని నాయకులు విజ్ఞప్తి చేశారు. అలాగే దొడ్డారెడ్డి శంకర్‌రెడ్డి ప్రజాసేవను గుర్తించి, ఆయన సతీమణి అనితకు సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు.గత పది రోజులుగా టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో ప్రచారం నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో దొడ్డారెడ్డి ప్రతాపరెడ్డి, మనోహర్‌రెడ్డి, గంజి సుధాకర్‌రెడ్డి, సామంచి శ్రీనివాస్, కంకణాల రజనీకాంత్ నాయుడు తదితర కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సంగారెడ్డి జిల్లా కుమ్మర సంఘం నూతన కమిటీ ఎన్నిక

- అసోసియేట్ అధ్యక్షుడిగా నారాయణ దాసు ఏకగ్రీవం



పటాన్ చెరువు మన జనప్రగతి అక్టోబర్ 30:-తెలంగాణ రాష్ట్ర కుమ్మర సంఘం సంగారెడ్డి జిల్లా నూతన కమిటీని శుక్రవారం సంగారెడ్డిలోని శివ బాంక్వెట్ హాల్‌లో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడు నడికూడ జయంత్ రావు మార్గదర్శకత్వంలో రాష్ట్ర నాయకుల ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు.జిల్లా అధ్యక్షుడిగా కుమ్మరి రామచందర్, ప్రధాన కార్యదర్శిగా రమేష్ బాబు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పరమేశ్వర్, అసోసియేట్ అధ్యక్షుడిగా నారాయణ దాసు, కోశాధికారిగా వెంకటేష్ ఎన్నికయ్యారు.నూతన కమిటీ కుమ్మర కులస్తుల ఐక్యతతో పాటు సామాజిక, ఆర్థిక, విద్యా అభివృద్ధికి కృషి చేయాలని సమావేశంలో నాయకులు ఆకాంక్షించారు. నారాయణ దాసు ఏకగ్రీవ ఎన్నికపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.

ప్రచారంలో పాల్గొన్న సీపీఐ,వైసీపీ అభ్యర్థులు



పత్తికొండ మన జనప్రగతి అక్టోబర్ 30:-పత్తికొండ పట్టణంలో శుక్రవారం సీపీఐ, వైసీపీ నాయకులు, కార్యకర్తలు కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. స్థానిక కుమ్మరి వీధి నుంచి ప్రారంభమైన ప్రచారం పట్టణంలోని పలు కాలనీల్లో కొనసాగింది. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నాగరత్నమ్మ, సీపీఐ మండల కార్యదర్శి యు. కారుమంచి పాల్గొన్నారు.సీపీఐ తరఫున 6వ ఎంపీటీసీ అభ్యర్థి జి. నెట్టికంటయ్య, 7వ ఎంపీటీసీ అభ్యర్థి వాకిటి కవిత, వైసీపీ తరఫున జడ్పీటీసీ అభ్యర్థి సి. శ్రీరంగుడు ప్రజలను కలిసి తమకు ఒక్క అవకాశం కల్పించాలని కోరారు. ప్రజా సమస్యలపై అవగాహనతో నిత్యం అందుబాటులో ఉంటూ, పత్తికొండ పట్టణ అభివృద్ధికి, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సోమశేఖర్, సీపీఐ పట్టణ కార్యదర్శి రామాంజనేయులు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ఎం. కృష్ణయ్య, సీపీఐ జిల్లా సమితి సభ్యులు సురేంద్ర, గురుదాస్, కారన్న, ఈరన్న, వెంకట్రాముడు, మండల సహాయ కార్యదర్శి జె. కాశీం, ప్రజాసంఘాల నాయకులు వెంకట్రాంరెడ్డి, రంగన్న, ఉరుకుందు, సిద్ధు, ఉపేంద్ర, ఎం.కె. సుంకన్న, పెద్దముని, మాదన్న, శాఖ కార్యదర్శులు నాగేంద్రయ్య, రవి, పందికోన రవి, దస్తగిరి, హమాలీ నాయకులు రాజేష్, రామంజి, బూడిద శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మొదటి రోజు పోస్టల్ బ్యాలెట్‌తో 11 మంది ఉద్యోగుల ఓటు హక్కు వినియోగం



బొమ్మనహల్ మన జనప్రగతి అక్టోబర్ 30 :-నవంబర్ అయిదవ తేదిన జరగబోయే ఎంపీటీసీ జడ్పీటీసీ ఎన్నికలలో బాగంగా ఎన్నికల విధులకు హాజరుకానున్న ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకునేలా ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ కేంద్రంలో మొదటి రోజు అనగా గురువారం 11 మంది ఉద్యోగులు ఓటు వేశారు,ఇంకా మిగిలినవారు నవంబర్ ఒక్కవ తేది వరకు ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్‌లో ఈ ప్రక్రియ కొనసాగిందనీ అందుకు ఎన్నికల విధులకు నియమితులైన ఉద్యోగులందరూ పోస్టల్ బ్యాలెట్ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎన్నికల అధికారి గోపాల్ నాయక్,సహాయక రిటర్నింగ్ అధికారి విజయభాస్కర్ సూచించారు.

ప్రత్యేక ఓటరు జాబితా సవరణకు గడువు పొడిగింపు

- నవంబర్ 20 వరకు క్లెయిమ్‌లు,

అభ్యంతరాల పరిష్కారం: 30న తుది జాబితా



మదనపల్లె, మన జనప్రగతి, అక్టోబర్ 30:- ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ ప్రక్రియలో క్లెయిమ్‌లు, అభ్యంతరాల పరిష్కారానికి గడువును నవంబర్ 20వ తేదీ వరకు పొడిగించినట్లు అన్నమయ్య జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ తెలిపారు.భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు సవరించిన షెడ్యూల్‌ను ప్రకటించినట్లు శుక్రవారం వెల్లడించారు. తొలుత అక్టోబర్ 22 వరకు నిర్ణయించిన క్లెయిమ్‌లు, అభ్యంతరాల పరిష్కార గడువును నవంబర్ 20 వరకు పొడిగించగా, అక్టోబర్ 30న ప్రచురించాల్సిన తుది ఓటరు జాబితాను నవంబర్ 30న విడుదల చేయనున్నట్లు పేర్కొన్నారు.2026 జూలై 1వ తేదీని అర్హత తేదీగా తీసుకుని చేపట్టిన ఈ ప్రక్రియలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటరు జాబితాలో చోటు కల్పించాలని, అనర్హమైన నమోదులను నిబంధనల ప్రకారం తొలగించాలని ఎన్నికల అధికారులకు కలెక్టర్ సూచించారు.

వైవీయూ తెలుగు పరిశోధకుడు దేవరపల్లి విశ్వనాథ్‌కు డాక్టరేట్



కడప, మన జనప్రగతి, అక్టోబర్ 30:- యోగి వేమన విశ్వవిద్యాలయం తెలుగు శాఖ పరిశోధక విద్యార్థి దేవరపల్లి విశ్వనాథ్‌కు పీహెచ్‌డీ డాక్టరేట్ లభించింది. తెలుగు శాఖ ప్రొఫెసర్ పాలెం రమాదేవి పర్యవేక్షణలో “ఒక దశాబ్ది రాయలసీమ కథలు – విశ్లేషణ (2011-2020)” అనే అంశంపై పరిశోధన చేసి సిద్ధాంత గ్రంథం సమర్పించినందుకు ఈ డిగ్రీని ప్రదానం చేసినట్లు పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య లక్ష్మీ ప్రసాద్ తెలిపారు.విశ్వనాథ్ పరిశోధన పత్రాలు పలు ప్రముఖ జర్నల్స్‌లో ప్రచురితమయ్యాయి. యూజీసీ నేషనల్ ఫెలోషిప్‌కు అర్హత సాధించి పరిశోధన పూర్తి చేశారు. ఆయన తిరుపతి జిల్లా ఓబులవారిపల్లి మండలం జడ్.హెచ్.డి.సి. కాలనీ-2కు చెందిన ఆంజనేయులు, నరసమ్మ దంపతుల కుమారుడు.డాక్టరేట్ సాధించిన విశ్వనాథ్‌ను వైవీయూ ఉపకులపతి ఆచార్య బెల్లంకొండ రాజశేఖర్, రిజిస్ట్రార్ ఆచార్య ఎన్.సి. గంగిరెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పి. శ్రీనివాస్, తెలుగు శాఖ అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు అభినందించారు.

మహమ్మద్ రఫీకి ఎం.వి.రావు ఫౌండేషన్ జర్నలిస్టు జాతీయ పురస్కారం ప్రదానం



ప్రొద్దుటూరు మన జనప్రగతి అక్టోబర్ 30:- ప్రొద్దుటూరు పట్టణానికి చెందిన సీనియర్ జర్నలిస్టు షేక్ మహమ్మద్ రఫీకి ఎం.వి. రావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠాత్మక జర్నలిస్టు జాతీయ పురస్కారం 2026 ప్రదానం చేశారు. నెల్లూరులోని విజయకుమార్ ఆసుపత్రి సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన ఈ పురస్కారాన్ని ప్రముఖుల చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా నెల్లూరు అడిషనల్ ఎస్పీ శ్రీనివాసరావు చేతుల మీదుగా మెమెంటోను, ప్రముఖ సినీ రచయిత ఎస్.వి. స్వామి నాయుడు చేతుల మీదుగా ప్రశంసాపత్రాన్ని, ఫౌండేషన్ ఛైర్మన్ ఎం. లీలా మోహన్ కృష్ణ చేతుల మీదుగా మెడల్‌ను మహమ్మద్ రఫీ స్వీకరించారు. జర్నలిజం రంగంలో ఆయన అందిస్తున్న సేవలను గుర్తించి జాతీయ స్థాయిలో ఈ పురస్కారానికి ఎంపిక చేయడం ప్రొద్దుటూరుకు గర్వకారణంగా నిలిచిందని పలువురు అభిప్రాయపడ్డారు. ఈ అవార్డు ఆయన వృత్తిపట్ల చూపుతున్న నిబద్ధతకు, జర్నలిజం రంగంలో కొనసాగిస్తున్న ప్రయాణానికి గుర్తింపుగా భావించవచ్చని,మన ప్రాంతానికి చెందిన జర్నలిస్టుకు జాతీయ స్థాయిలో పురస్కారం లభించడంతో పలువురు జర్నలిస్టులు, పాత్రికేయ సంఘాల ప్రతినిధులు, మిత్రులు, శ్రేయోభిలాషులు హర్షం వ్యక్తం చేస్తూ షేక్ మహమ్మద్ రఫీకి అభినందనలు తెలియజేశారు.

రైతు సంక్షేమానికి చంద్రబాబు ప్రభుత్వం ప్రాధాన్యత



రాయచోటి మన జనప్రగతి అక్టోబర్ 30:-రైతు సంక్షేమమే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రధాన ధ్యేయమని రాష్ట్ర తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు గాజుల ఖాదర్ బాషా పేర్కొన్నారు. శుక్రవారం రాయచోటిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ పథకం కింద అర్హులైన ప్రతి రైతు కుటుంబానికి ఏడాదికి రూ.20 వేల ఆర్థిక సాయం అందిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా రెండో విడతగా రూ.7 వేల చొప్పున రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు పేర్కొన్నారు. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు, రైతులకు అండగా నిలిచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు.రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలు సానుకూలంగా ఉన్నారని, స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులకు ప్రజల మద్దతు ఉంటుందని ఆయన పేర్కొన్నారు. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో గ్రామాలు, పట్టణాలు అభివృద్ధి చెందాయని, ప్రజలు కష్టాల్లో ఉన్నప్పుడు క్షేత్రస్థాయికి వెళ్లి పరామర్శించిన నాయకుడు చంద్రబాబు నాయుడని అన్నారు. చంద్రబాబుపై విమర్శలు చేసే అర్హత వైఎస్సార్‌సీపీకి లేదని విమర్శించారు.రాయచోటి నియోజకవర్గంలో మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో పలు అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. గతంలో గుంతలమయంగా ఉన్న గ్రామీణ రహదారులకు మరమ్మతులు చేయడంతోపాటు కొత్త రహదారులు నిర్మించారని, తాగునీటి సౌకర్యం కల్పించారని పేర్కొన్నారు. గాలివీడు జడ్పీటీసీ అభ్యర్థి సుగవాసి ప్రసాద్ బాబు తరఫున మంత్రి సోదరుడు మండిపల్లి లక్ష్మీప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చిన్నమండెం జడ్పీటీసీ అభ్యర్థి డాక్టర్ లక్ష్మీప్రసాద్ రెడ్డి, సంబేపల్లి జడ్పీటీసీ అభ్యర్థి మల్లు కరుణకు కూడా మద్దతు లభిస్తోందని చెప్పారు.టీడీపీ నాయకులు నాగార్జున రెడ్డి, వెంకటరమణారెడ్డి, వాసు, రఫీ, హైదర్, అమీర్ బాషా తదితరులు పాల్గొన్నారు.

చిట్వేలిలో గుత్తి నరసింహులుకు విశేష స్పందన



చిట్వేలి మన జనప్రగతి అక్టోబర్ 30:-చిట్వేలి మండల జడ్పీటీసీ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా నిలిచిన గుత్తి నరసింహులుకు గ్రామాల్లో విశేష స్పందన లభిస్తోంది. ఆయన ప్రచారానికి ప్రజలు ఆత్మీయ స్వాగతం పలుకుతుండగా, మహిళలు పూలు, హారతులతో నీరాజనాలు పలుకుతున్నారు.తెలుగుదేశం నాయకుడిగా మండల ప్రజలతో సత్సంబంధాలు కలిగిన నరసింహులు తొలుత పార్టీ తరఫున ప్రచారం నిర్వహించారు. అయితే కూటమి సీట్ల సర్దుబాటులో చిట్వేలి స్థానం జనసేనకు కేటాయించడంతో స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలిచారు.శుక్రవారం రాజుగుంట పంచాయతీ చింతలచెలిక గ్రామం నుంచి ప్రచారం ప్రారంభించి రాజుగుంట, తిమ్మాయపాలెం, కొత్తపల్లి, గట్టుమీదపల్లి, తుమ్మకొండ గ్రామాల్లో పర్యటించారు. సుమారు 20 వాహనాల్లో వచ్చిన అభిమానులు, అనుచరులు ప్రచారంలో పాల్గొన్నారు. మహిళలు హారతులతో స్వాగతించగా, ఆలయాల్లో పూజలు నిర్వహించి ప్రజల ఆశీర్వాదాలు తీసుకున్నారు.తమ కష్టసుఖాల్లో అండగా నిలిచిన నాయకుడిగా నరసింహులును గ్రామీణులు గుర్తు చేసుకుంటున్నారు. మండలంలోని 20 గ్రామ పంచాయతీల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ప్రచారంలో పాల్గొంటున్నారు. ఏసీ గుర్తుపై పోటీ చేస్తున్న ఆయన ప్రజలు ఆదరించి గెలిపించాలని కోరుతూ, మండల ప్రజలకు నిరంతరం సేవలందిస్తానని హామీ ఇస్తున్నారు.

కార్తీక్ రాజుకు లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ మద్దతు



కనిగిరి మన జనప్రగతి అక్టోబర్ 30:- కనిగిరి జడ్పీటీసీ స్థానానికి బీసీవై పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న వంగెవరపు కార్తీక్ రాజుకు లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఈ మేరకు కనిగిరి నియోజకవర్గ లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ కెప్టెన్ దమ్ము వెంకటేష్ తన మద్దతును వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలతో పాటు అగ్రవర్ణాల్లోని పేదల హక్కుల కోసం కార్తీక్ రాజు పనిచేస్తున్నారని పేర్కొన్నారు. బహుజన వాదిగా పేద ప్రజల సమస్యలపై నిరంతరం స్పందిస్తూ, వారి అభ్యున్నతి కోసం కృషి చేస్తున్నారని తెలిపారు. కనిగిరి పట్టణ, గ్రామీణ ప్రాంతాల ఓటర్లు ఆయన అభ్యర్థిత్వాన్ని పరిశీలించి నిర్ణయం తీసుకోవాలని కోరారు.రాజకీయాల్లో మార్పు రావాలని, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలు రాజ్యాంగబద్ధమైన అధికార సాధన దిశగా ముందుకు సాగాలని ఆయన ఆకాంక్షించారు. ఈ క్రమంలో జడ్పీటీసీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న వంగెవరపు కార్తీక్ రాజుకు తమ పార్టీ మద్దతు ప్రకటిస్తున్నట్లు దమ్ము వెంకటేష్ వెల్లడించారు.

విద్యార్థుల సృజనాత్మకతకు వేదికగా జిల్లాస్థాయి పోటీలు

- రోల్ ప్లే, జానపద నృత్య పోటీల్లో విద్యార్థుల ప్రతిభ
- రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు



రాయచోటి మన జనప్రగతి అక్టోబర్ 30:- విద్యార్థుల్లో దాగివున్న కళాత్మక, సృజనాత్మక నైపుణ్యాలను వెలికితీసి, వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడమే జిల్లాస్థాయి రోల్ ప్లే, జానపద నృత్య పోటీల ప్రధాన ఉద్దేశమని డైట్ ఇన్‌చార్జి ప్రిన్సిపల్ మడితాటి నరసింహారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం రాయచోటిలోని జిల్లా విద్యా శిక్షణ సంస్థ (డైట్)లో జాతీయ జనాభా విద్యా కార్యక్రమంలో భాగంగా జిల్లాస్థాయి రోల్ ప్లే, జానపద నృత్య పోటీలను ఘనంగా నిర్వహించారు. ఈ పోటీల్లో వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు.ఈ సందర్భంగా నరసింహారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు కళలు, సాంస్కృతిక కార్యక్రమాలపై కూడా ఆసక్తి కనబరచాలని సూచించారు. ఇలాంటి పోటీలు సృజనాత్మక ఆలోచనలను, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేందుకు దోహదపడతాయన్నారు. జిల్లాస్థాయిలో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు మరింత పట్టుదలతో సాధన చేసి ఉన్నత విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులురోల్ ప్లే పోటీల్లో రాయచోటిలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన లాస్య, త్రివేణి, సంజన, జ్యోత్స్న, పల్లవి, గాయత్రి ఎంపికయ్యారు. జానపద నృత్య పోటీల్లో కె.రామాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన మేఘన, పుష్ప, రెడ్డమ్మ, కృష్ణవేణి, గీతాంజలి, హిమశ్రీ రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారు. ఎంపికైన విద్యార్థులకు నవంబర్‌లో విజయవాడలో రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా పోటీల సమన్వయకర్త కొండా వెంకటసుబ్బారెడ్డి, డైట్ అధ్యాపకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ప్రచార కార్యక్రమాలు, మద్యం విక్రయాలపై నిషేధం: కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి



కడప, మన జనప్రగతి, అక్టోబర్ 30:-జిల్లాలో నవంబర్ 1న జరగనున్న మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో అక్టోబర్ 30వ తేదీ సాయంత్రం 5 గంటల నుంచి సైలెన్స్ పీరియడ్ అమల్లోకి వస్తుందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి తెలిపారు.నిశ్శబ్ద కాలంలో బహిరంగ సభలు, ర్యాలీలు, ఊరేగింపులు, ఇంటింటి ప్రచారాలతో పాటు అన్ని రకాల ఎన్నికల ప్రచార కార్యక్రమాలను నిలిపివేయాలని స్పష్టం చేశారు. పోలింగ్ జరిగే ప్రాంతాల్లో ఓటర్లు కాని బయటి వ్యక్తులు ఉండరాదని సూచించారు.అలాగే మద్యం దుకాణాలు మూసివేయడంతో పాటు మద్యం విక్రయాలు, పంపిణీ పూర్తిగా నిషేధమని తెలిపారు. ఓటర్లకు నగదు, మద్యం, ఇతర వస్తువుల పంపిణీ ద్వారా ప్రలోభపెట్టే ప్రయత్నాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఎన్నికల నియమావళిని రాజకీయ పార్టీలు, అభ్యర్థులు, ప్రజలు తప్పనిసరిగా పాటించాలని, ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కలెక్టర్ కోరారు.

కూటమి దిగజారుడు రాజకీయాలను ప్రజలు గమనిస్తున్నారు

- న్యాయమే అంతిమంగా గెలుస్తుంది..

రౌడీయిజాన్ని ఓడించాలి:బండి దీప్తి



కడప మన జనప్రగతి అక్టోబర్ 30:-కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న అణిచివేత, దౌర్జన్య రాజకీయాలను ప్రజలు గమనిస్తున్నారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కడప మేయర్ అభ్యర్థి బండి దీప్తి అన్నారు.శుక్రవారం జిల్లా వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. స్థానిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని ఎదుర్కోలేక కూటమి ప్రభుత్వం పోలీసు, రెవెన్యూ అధికారులను ఉపయోగించుకుని ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడుతోందని ఆరోపించారు. గత పది రోజులుగా సుమారు 300 మంది అభ్యర్థులను నామినేషన్లు వేయకుండా అడ్డుకున్నారని, స్క్రూటినీలో ఎలాంటి తప్పులు లేకపోయినా అధికార దుర్వినియోగంతో పలు వార్డులను ఏకగ్రీవం చేసుకున్నారని విమర్శించారు.కడప నగరాన్ని గతంలో వైఎస్సార్, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో అభివృద్ధి చేశారని, ప్రస్తుత కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నగరంలో అభివృద్ధి పూర్తిగా నిలిచిపోయిందని ఆరోపించారు. నిధులను అమరావతికి తరలిస్తున్నారే తప్ప కడప అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వడం లేదన్నారు.ప్రజలు ఆదివారం జరిగే ఎన్నికల పోలింగ్‌లో తప్పనిసరిగా పాల్గొని తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని, న్యాయాన్ని గెలిపించి రౌడీయిజాన్ని ఓడించాలని పిలుపునిచ్చారు. ప్రజలకు ఎక్కడైనా అన్యాయం, అణిచివేత ఎదురైతే 8328127251 నంబర్‌కు ఫోన్ చేయాలని, ఐదు నిమిషాల్లో స్పందిస్తామని తెలిపారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ఓటు వేయాలని బండి దీప్తి కోరారు. అలాగే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలని తెలిపారు. డివిజన్ ఇంచార్జిలు తదితరులు పాల్గొన్నారు.

మన జనప్రగతి
జనం కోసం.. అక్షర ప్రగతి...
తెలుగు దినపత్రిక

31 - 10 - 2026

73వ రాష్ట్ర మహిళల సీనియర్ కబడ్డీ ఛాంపియన్‌షిప్‌లో ముప్ప విజయ్ బాబుతో ప్రముఖుల ఆత్మీయ భేటీ

● మహిళా క్రీడాకారిణులకు రాష్ట్రస్థాయి పోటీలు గొప్ప ప్రోత్సాహం



సత్తుపల్లి,మన జనప్రగతి, అక్టోబర్ 30:మహిళా క్రీడాకారిణుల్లో క్రీడాస్ఫూర్తిని పెంపొందిస్తూ, వారి ప్రతిభకు రాష్ట్రస్థాయిలో గుర్తింపు తీసుకొచ్చే లక్ష్యంతో సత్తుపల్లి పట్టణంలో నిర్వహిస్తున్న 73వ రాష్ట్ర మహిళల సీనియర్ కబడ్డీ ఛాంపియన్‌షిప్ పోటీలు క్రీడాభిమానుల్లో ఉత్సాహాన్ని నింపుతున్నాయి. ఈ క్రీడా సంబరాల సందర్భంగా టోర్నమెంట్ కార్యక్రమానికి హాజరైన మాజీ తెలంగాణ రాష్ట్ర ఇరిగేషన్ చైర్మన్ ముప్ప విజయ్ బాబును పలువురు ప్రముఖులు మర్యాదపూర్వకంగా కలిసి ఆత్మీయంగా ముచ్చటించారు.ఈ సందర్భంగా చల్లా రామకృష్ణారెడ్డి, వెనిగళ్ల నాగేశ్వరరావు, కరాటే వేణు, దుర్గ, డీఎస్ఎన్ రాజు తదితరులు ముప్ప విజయ్ బాబును కలిసి టోర్నమెంట్ విశేషాలను చర్చించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో మహిళా క్రీడాకారిణులు పాల్గొని తమ ప్రతిభను చాటుకోవడం అభినందనీయమని వారు పేర్కొన్నారు.మహిళలు క్రీడారంగంలో మరింతగా రాణించేందుకు ఇలాంటి రాష్ట్రస్థాయి పోటీలు ఎంతగానో దోహదపడతాయని, క్రీడాకారిణుల్లో ఆత్మవిశ్వాసం, పట్టుదల, క్రమశిక్షణతో పాటు జట్టుగా పనిచేసే నైపుణ్యాన్ని పెంపొందిస్తాయని అభిప్రాయపడ్డారు. మహిళా క్రీడాకారిణులకు మరిన్ని అవకాశాలు కల్పిస్తూ, వారి ప్రతిభను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.కబడ్డీ వంటి సంప్రదాయ క్రీడలకు ప్రోత్సాహం అందించడం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభావంతులైన క్రీడాకారిణులకు మంచి భవిష్యత్తు లభిస్తుందని, సత్తుపల్లిలో నిర్వహిస్తున్న ఈ ఛాంపియన్‌షిప్ విజయవంతంగా కొనసాగాలని వారు ఆకాంక్షించారు.

రామారావు హత్య కేసులో అసలు నిజాలు వెలికితీయాలి

● సీపీని సస్పెండ్ చేసి సమగ్ర విచారణ జరిపించాలి: నున్నా నాగేశ్వరరావు

● బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు పోరాటం: పోతినేని సుదర్శన్‌రావు



ఖమ్మం మన జనప్రగతి, అక్టోబర్ 30:సామినేని రామారావు హత్య కేసులో అసలు నిందితులను గుర్తించి, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఖమ్మంలోని సుందరయ్య భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్‌రావు మాట్లాడుతూ పోలీసుల దర్యాప్తు తీరుపై అనుమానాలు వ్యక్తం చేశారు. అసలు నిందితులను కాపాడేలా దర్యాప్తు సాగుతోందని ఆరోపించారు.హత్య వెనుక ఉన్న కారణాలను నిష్పక్షపాతంగా వెలికితీయాలని, కేసును పక్కదారి పట్టించకుండా సమగ్ర విచారణ జరపాలని కోరారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు ప్రజా, న్యాయపోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ పోలీస్ కమిషనర్‌ను తక్షణమే సస్పెండ్ చేసి, ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)తో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. అవసరమైతే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో పలువురు సీపీఎం జిల్లా నాయకులు పాల్గొన్నారు.

తక్కువ ఖర్చుతో సైన్స్ ప్రయోగాలు

● పనికిరాని వస్తువులతో అద్భుత ప్రయోగాలు..

కొత్త ఉపాధ్యాయులకు జేవీవీ శిక్షణ



ఖమ్మం ప్రతినిధి, మన జనప్రగతి, అక్టోబర్ 30: సైన్స్ బోధనను ప్రయోగాత్మకంగా, విద్యార్థి కేంద్రంగా నిర్వహించాలని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు అలవాల నాగేశ్వరరావు సూచించారు. 2024 డీఎస్సీ ద్వారా కొత్తగా నియమితులైన విజ్ఞానశాస్త్ర ఉపాధ్యాయులకు ఖమ్మంలోని రిక్కా బజార్ ఉన్నత పాఠశాలలో 'లో కాస్ట్.. నో కాస్ట్ పరికరాలతో ప్రయోగాలు' అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్లాస్టిక్ సీసాలు, కొబ్బరి చిప్పలు, పాత సైకిల్ ట్యూబుల వంటి పనికిరాని వస్తువులతోనే అనేక సైన్స్ ప్రయోగాలు చేయవచ్చన్నారు. విద్యార్థులు స్వయంగా ప్రయోగాలు చేసినప్పుడే శాస్త్రీయ ఆలోచన, ఆసక్తి పెరుగుతాయని పేర్కొన్నారు. అనంతరం వనరుల వ్యక్తులు గాలి పీడనం, కాంతి వక్రీభవనం, అయస్కాంతం, శబ్ద తరంగాలకు సంబంధించిన ప్రయోగాలను చేసి చూపించారు.కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి ఆర్. శ్రీనివాసరావు, ప్రధానోపాధ్యాయులు వి. శాంత, మాధవరావు, జేవీవీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ రమేష్, ప్రధాన కార్యదర్శి నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.

పులివెందులలో పోలీసుల మెరుపు తనిఖీలు

- మెట్ట కరుణాకర్ నివాసంలో సాధారణ సోదాలు

పులివెందుల, మన జనప్రగతి, అక్టోబర్ 30: ఎన్నికల నేపథ్యంలో పులివెందుల నియోజకవర్గంలో పోలీసులు భద్రతా చర్యలను ముమ్మరం చేశారు. జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా పులివెందుల అర్బన్ పరిధిలోని మెట్ట కరుణాకర్ నివాసంతో పాటు పలు ప్రాంతాల్లో పోలీసులు సాధారణ తనిఖీలు నిర్వహించారు.ఎన్నికల సమయంలో ఓటర్లను ప్రలోభపెట్టేందుకు అక్రమంగా తరలించే నగదు, మద్యం, ఇతర బహుమతులను అరికట్టడం, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు చేపట్టడం ఈ తనిఖీల ప్రధాన ఉద్దేశమని పోలీసులు తెలిపారు.పులివెందుల అర్బన్ సీఐ వై. పురుషోత్తం రాజు, రూరల్ సీఐ ఆర్.కె. వ్యాల్యూ శంకర్, రూరల్ ఎస్ఐ శాంతిలాల్ నేతృత్వంలో జరిగిన తనిఖీల్లో సింహాద్రిపురం ఎస్ఐ ఘన మద్దిలేటి, అర్బన్ ఎస్ఐ సుబహాన్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.ఎన్నికల నియమావళిని ఉల్లంఘించినా, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసు అధికారులు హెచ్చరించారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ప్రజలు, రాజకీయ పార్టీల నాయకులు పోలీసులకు సహకరించాలని కోరారు.

మగ్బుల్ విద్యాబోధన నేటితరం ఉపాధ్యాయులకు ఆదర్శం

- రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షులు పరిశ పుల్లయ్య

- క్రమశిక్షణ, అంకితభావం, సమయపాలనే ఆయన బలం

- అక్షరాలతో జీవితాలను తీర్చిదిద్దిన అలుపెరుగని గురువుకు ఘన వీడ్కోలు



ఖమ్మం ప్రతినిధి, మన జనప్రగతి, అక్టోబర్ 30: ఒక గురువు సేవ ఎంత గొప్పదో, ఆయన నేర్పిన విద్యార్థుల జీవితాలే చెబుతాయి. క్రమశిక్షణ, అంకితభావం, సమయపాలనను ఊపిరిగా చేసుకుని, తాను పనిచేసిన ప్రతి పాఠశాలలో విద్యాభివృద్ధికి అహర్నిశలు శ్రమించిన సయ్యద్ మగ్బుల్ నేటి తరం ఉపాధ్యాయులకు ఆదర్శమని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం (ఎన్జిపిఏటి) జిల్లా అధ్యక్షులు పరిశ పుల్లయ్య ఉద్ఘాటించారు. జగ్యాతండా ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు సయ్యద్ మగ్బుల్ ఉద్యోగ విరమణ సన్మానోత్సవం శుక్రవారం ఆత్మీయ వాతావరణంలో ఘనంగా జరిగింది. ఎందరో విద్యార్థులకు అక్షరాభ్యాసం నేర్పి, వారిని ఉన్నత చదువుల వైపు నడిపించి, వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేసిన ఆ గురువుకు వీడ్కోలు పలుకుతూ సభ భావోద్వేగంతో నిండిపోయింది. ఈ సందర్భంగా పరిశ పుల్లయ్య మాట్లాడుతూ... "విద్యార్థుల విజయంలో తన విజయాన్ని చూసుకునే గురువులు అరుదు. మగ్బుల్ అటువంటి అరుదైన ఉపాధ్యాయుడు. ఆయన నేర్పిన పాఠాలు విద్యార్థుల హృదయాల్లో చిరస్థాయిగా నిలుస్తాయి" అని కొనియాడారు. అనంతరం ఉద్యోగ విరమణ చేస్తున్న సయ్యద్ మగ్బుల్ దంపతులను ఎన్జిపిఏటి జిల్లా శాఖ తరఫున శాలువాలతో సత్కరించి, జ్ఞాపికను అందజేశారు. ఇదే వేదికపై పెన్షనర్ల సమస్యలను కూడా పుల్లయ్య ప్రస్తావించారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిలు అందక పెన్షనర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి బకాయిలను ఏకమొత్తంగా చెల్లించాలని, పెన్షనర్ల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కోరారు. జీవితమంతా సమాజ నిర్మాణానికి అంకితమైన ఉద్యోగులకు విశ్రాంత జీవితంలో భరోసా కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో ఎన్జిపిఏటి జిల్లా అధ్యక్షులు పరిశ పుల్లయ్య, జిల్లా సహ అధ్యక్షులు కనపర్తి వెంకటేశ్వర్లు, ఆర్థిక కార్యదర్శి గుర్రాల శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి కనపర్తి నాగప్రసాద్, జిల్లా నాయకులు చెరుకూరి వెంకటేశ్వర్లు, వాలి సురేష్ బాబు, మేకల కృష్ణయ్య, దొడ్డా వరప్రసాదరావు, కుమారస్వామి, నాగభూషణం, గోపాలరావు, సత్యనారాయణ, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కిట్స్ వరంగల్‌లో ఘనంగా జాతీయ స్థాయి సాంకేతిక సింపోజియం 'సంశోధిని26' ప్రారంభం

- 52 కళాశాలల నుంచి 1,707 మంది విద్యార్థుల హాజరు.. రెండు రోజుల పాటు 50కి పైగా సాంకేతిక కార్యక్రమాలు





వరంగల్, మన జనప్రగతి, అక్టోబర్ 30:కాకతీయ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (కిట్స్) వరంగల్ క్యాంపస్‌లో జాతీయ స్థాయి విద్యార్థి సాంకేతిక సింపోజియం 'సంశోధిని26' శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. అక్టోబర్ 30, 31 తేదీల్లో రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని హైదరాబాద్ టీజీఎన్‌పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి ఐఏఎస్, టీసీఎస్ హైదరాబాద్ రీజినల్ హెడ్ రిచర్డ్ కింగ్ చత్రగడ్డ ముఖ్య అతిథులుగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా ముఖ్య అతిథి కర్నాటి వరుణ్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ఆత్మవిశ్వాసం, ఆత్మగౌరవంతో పాటు కమ్యూనికేషన్ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. ప్రాథమిక అంశాలపై పట్టు సాధిస్తూ స్వల్పకాలిక, దీర్ఘకాలిక లక్ష్యాలతో ముందుకు సాగాలన్నారు. వినూత్న ఆలోచనలకు ప్రాధాన్యతనిస్తూ స్టార్టప్‌లు స్థాపించే దిశగా కృషి చేయాలని, సాంకేతిక పరిజ్ఞానాన్ని సమాజ సమస్యల పరిష్కారానికి వినియోగించాలని పిలుపునిచ్చారు. ఏఐ వంటి అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలపై అవగాహన పెంచుకుంటూ విమర్శనాత్మక, విభిన్న ఆలోచనా విధానాలను అలవర్చుకోవాలని సూచించారు.గౌరవ అతిథి రిచర్డ్ కింగ్ చత్రగడ్డ మాట్లాడుతూ విద్యార్థులకు సమస్యలను విశ్లేషించి పరిష్కరించే సామర్థ్యం ఎంతో అవసరమన్నారు. ఉద్యోగ సాధనలో సాంకేతిక నైపుణ్యాలతో పాటు జీవిత నైపుణ్యాలు కీలకమని పేర్కొన్నారు. గెలుపు ఒక్కటే లక్ష్యం కాకుండా నిరంతరం సాధన చేస్తూ కొత్త విషయాలను నేర్చుకోవడం, అభివృద్ధి చెందడం ముఖ్యమని తెలిపారు.కిట్స్ వరంగల్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. అశోక రెడ్డి మాట్లాడుతూ 'సాంప్రదాయ ఆలోచనలకు అతీతంగా' అనే థీమ్‌తో సంశోధిని26 నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కళాశాలలోని 11 విభాగాల ఆధ్వర్యంలో 12 సాంకేతిక వర్క్‌షాప్‌లు, పేపర్ ప్రజెంటేషన్లు, ప్రాజెక్ట్ ఎక్స్‌పో, ఇన్నోవిజన్‌తో పాటు 50కి పైగా సాంకేతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.కిట్స్ వరంగల్ అదనపు కార్యదర్శి, హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వి. సతీష్ కుమార్ అధ్యక్షోపన్యాసం చేస్తూ విద్యార్థులు స్వీయ క్రమశిక్షణ, ఏకాగ్రతతో లక్ష్య సాధనకు కృషి చేయాలని సూచించారు. నైపుణ్యాలను పెంపొందించుకోవడం ద్వారా మెరుగైన ఉద్యోగ అవకాశాలు, ప్యాకేజీలు పొందవచ్చని తెలిపారు.కిట్స్ వరంగల్ మాజీ రాజ్యసభ సభ్యుడు, ఛైర్మన్ కెప్టెన్ వి. లక్ష్మీకాంత రావు, కోశాధికారి పి. నారాయణ రెడ్డి తదితరులు సింపోజియం నిర్వహణకు కృషి చేసిన అధ్యాపకులు, విద్యార్థి సమన్వయకర్తలను అభినందించారు.కార్యక్రమ కన్వీనర్, డీన్ స్టూడెంట్ అఫైర్స్ ప్రొఫెసర్ కె. శ్రీధర్ మాట్లాడుతూ ఈ సాంకేతిక సింపోజియంలో 52 కళాశాలల నుంచి 1,707 మంది విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. విద్యార్థులు తమ పరిశోధన జ్ఞానాన్ని పెంపొందించుకునేందుకు ఏడాదికి రూ.45 లక్షల విలువైన పరిశోధనా జర్నల్స్ గ్రంథాలయంలో అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కిట్స్ యాజమాన్య సభ్యులు ఇ. వెంకట్రామ్ రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం. కోమల్ రెడ్డి, ఐఎస్‌టీఈ కిట్స్ చాప్టర్ ఛైర్మన్ డాక్టర్ టి. మధుకర్ రెడ్డి, కో-కోఆర్డినేటర్లు డాక్టర్ ఎస్. సునీల్ ప్రతాప్ రెడ్డి, బి. శశికాంత్, పీఆర్ఓ డాక్టర్ డి. ప్రభాకరాచారి, వివిధ విభాగాల డీన్లు, హెచ్ఓడీలు, అధ్యాపకులు, విద్యార్థి ప్రతినిధులు పాల్గొన్నారు.

కమలాపూర్‌లో జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ ఆకస్మిక పర్యటన








కమలాపూర్ మన జనప్రగతి, అక్టోబర్ 30: హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం లో హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ ఆకస్మికంగా పర్యటించారు. కమలాపూర్ మండల కేంద్రంలోని సి హెచ్ సి హాస్పటల్ ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రం పరిసరాలను పర్యవేక్షించి వైద్యుల నుండి వివరాలను అడిగి తెలుసుకున్నారు.అనంతరం హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న రోగులను పరిశీలించి వారి ఆరోగ్య పరిస్థితులను,వైద్యం అందుతున్న తీరును పరిశీలించారు.వైద్యులు సమయపాలన పాటిస్తూ రోగులకు సత్వర సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ సూచించారు.అనంతరం ఎం జె పి బాలుర గురుకుల పాఠశాలను సందర్శించి తరగతి గదులు, వంట గదులు పరిశీలించి పలు సూచనలు చేశారు.గురుకుల విద్యాలయాన్ని పరిశుభ్రంగా ఉంచుతూ నాణ్యమైన విద్యను అందిస్తూ విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించాలని జిల్లా కలెక్టర్ ఉపాధ్యాయ బృందానికి సూచించారు.ప్రభుత్వం సూచించిన మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలని వంట గదులు ఎప్పటికప్పుడు పరిశుభ్రత పాటించాలని కలెక్టర్ అన్నారు. అనంతరం మండలంలోని గూనీ పర్తి గ్రామాన్ని సందర్శించారు. గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించారు.గ్రామ సర్పంచ్, ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులతో ముచ్చటించారు.ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ఎదురయ్యే సమస్యలను వారు ఎదుర్కొంటున్న ఇబ్బందులు గురించి లబ్ధిదారులను, అధికారులను జిల్లా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారులు ఎదుర్కొంటున్న సమస్యలు సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో కమలాపూర్ మండల తాహ సిల్దార్ ఏం సురేష్ కుమార్, మండల అభివృద్ధి అధికారి గుండె బాబు,గూనిపర్తి గ్రామ సర్పంచ్ బుర్ర రాధిక కరుణాకర్ గౌడ్,ఉప సర్పంచ్,మండల రెవెన్యూ,మండల పరిషత్ అధికారులు,సి హెచ్ సి హాస్పటల్ వైద్య బృందం, సిబ్బంది,ఎం జె పి పాఠశాల ఉపాధ్యాయ బృందం,గూనిపర్తి గ్రామపంచాయతీ కార్యదర్శి, వివిధ శాఖల అధికారులు,ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ ఎన్నికల వేళ పులివెందులలో
పోలీసుల భారీ ఫ్లాగ్ మార్చ్

- శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయం..
- 5 కిలోమీటర్ల మేర సాగిన కవాతు.. ప్రజలకు భరోసా





పులివెందుల అర్బన్ మన జనప్రగతి అక్టోబర్ 30: సమీపిస్తున్న మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణ,ప్రజల్లో భద్రతాభావం కల్పించడమే లక్ష్యంగా పోలీసు శాఖ భారీ ఫ్లాగ్ మార్చ్ నిర్వహించింది. కడప జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్,ఐపీఎస్ ఆదేశాల మేరకు అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె.ప్రకాష్ బాబు నేతృత్వంలో సుమారు 5 కిలోమీటర్ల మేర ఈ కవాతు కొనసాగింది.పులివెందుల పోలీస్ స్టేషన్ వద్ద ప్రారంభమైన ఈ ఫ్లాగ్ మార్చ్ పూలంగళ్ల సర్కిల్, పాత బస్టాండ్,పాల్ రెడ్డి మెమోరియల్,పార్నపల్లి రోడ్డు,ముద్దనూరు రోడ్డు మీదుగా పట్టణంలోని ప్రధాన రహదారుల గుండా సాగి తిరిగి పోలీస్ స్టేషన్‌కు చేరుకుంది.పులివెందుల డి.ఎస్పీ బుక్కే మురళి నాయక్ పర్యవేక్షణలో, అర్బన్ సీఐ పురుషోత్తం రాజు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.ప్రధాన కూడళ్లు,రద్దీ ప్రాంతాల్లో పోలీసులు మార్చ్ నిర్వహిస్తూ ప్రజలకు రక్షణపై పూర్తి భరోసా కల్పించారు. ఎన్నికలను ప్రశాంతంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు అన్ని రకాల ముందస్తు భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు ఉన్నతాధికారులు తెలిపారు. ఓటర్లు ఎలాంటి భయం, ప్రలోభాలు లేకుండా స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు.ఎన్నికల వేళ శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తప్పవని, పట్టణంలో నిరంతర నిఘా కొనసాగుతుందని స్పష్టం చేశారు.ఈ కవాతులో ప్రొద్దుటూరు డి.ఎస్పీ ఇ.బాలస్వామి రెడ్డి,ఆర్కే వ్యాలీ సీఐ శంకర్ రెడ్డి, పులివెందుల రూరల్ సీఐ శాంతి లాల్,వేంపల్లి సీఐ నరసింహులు,ప్రొద్దుటూరు వన్ టౌన్ సీఐ కొండారెడ్డిలతో పాటు సబ్ డివిజన్ పరిధిలోని పలువురు ఎస్.ఐలు,భారీ సంఖ్యలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వొద్దు

అధికారులకు కలెక్టర్ నిశాంత్ కుమార్ ఆదేశాలు

పటిష్ట బందోబస్తు ఏర్పాటు: ఎస్పీ ధీరజ్ కునుబిల్లి



మదనపల్లె, మన జనప్రగతి, అక్టోబర్ 30:- అన్నమయ్య జిల్లాలో మున్సిపల్, జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలను ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ అధికారులను ఆదేశించారు. ఎన్నికల నియమావళి, రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు.శుక్రవారం మదనపల్లె కలెక్టరేట్‌లోని నీతి హాలులో జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లితో కలిసి ఎన్నికల నిర్వహణ, పోలింగ్, కౌంటింగ్ సన్నద్ధత, భద్రతా ఏర్పాట్లపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోలింగ్ సిబ్బంది కేటాయింపు, బ్యాలెట్ పేపర్లు, ఎన్నికల సామగ్రి పంపిణీ, పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు, సిబ్బందికి శిక్షణ వంటి ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద 100 మీటర్ల పరిధిని గుర్తించి, వైద్య, పారిశుధ్య సదుపాయాలు కల్పించాలని సూచించారు. కంట్రోల్ రూమ్ ద్వారా ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. మదనపల్లె, రాయచోటి, పీలేరు డివిజన్లలో కౌంటింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూముల ఏర్పాట్లపై సూచనలు చేశారు.జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి మాట్లాడుతూ ఎన్నికల కోసం పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రతి పోలింగ్ కేంద్రానికి పోలీసు సిబ్బందిని కేటాయించి, ట్రాఫిక్ నియంత్రణ, ఓటర్ల రాకపోకల నిర్వహణకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించినట్లు చెప్పారు. సుమారు 10 క్విక్ రెస్పాన్స్ టీమ్‌లను ఏర్పాటు చేసి నిరంతర పర్యవేక్షణ చేపడతామన్నారు. రాత్రి పెట్రోలింగ్, చెక్‌పోస్టుల తనిఖీలను ముమ్మరం చేస్తామని, ఎన్నికల ఫిర్యాదులపై తక్షణమే స్పందిస్తామని పేర్కొన్నారు.ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ శర్మ, సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి, అడిషనల్ ఎస్పీ వెంకటాద్రి, డీఆర్వో వెంకటేష్, ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు, జెడ్పీ సీఈఓ, ఎన్నికల నోడల్ అధికారులు, రిటర్నింగ్ అధికారులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మైదుకూరులో పోలీసుల కవాతు
ప్రజలకు భద్రతపై భరోసా

- భయాందోళనలు లేకుండా ఓటు వేయాలని పోలీసుల విజ్ఞప్తి



మైదుకూరు, మన జనప్రగతి, అక్టోబర్ 30:- నవంబర్ 1న జరగనున్న మైదుకూరు మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో పట్టణంలో పోలీసులు కవాతు నిర్వహించారు. ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా పోలీసు శాఖ పటిష్ట భద్రతా చర్యలు చేపట్టింది.మైదుకూరు సబ్ డివిజన్ డీఎస్పీ రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో మైదుకూరు అర్బన్ సీఐ హాజీవలి, రూరల్ సీఐ శివశంకర్‌తో పాటు ఇతర పోలీసు అధికారులు, రిజర్వ్ పోలీసు సిబ్బంది ఈ కవాతులో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎన్నికల సమయంలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. ఎన్నికలను ప్రశాంతంగా, స్వేచ్ఛాయుతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు పోలీసు శాఖ సిద్ధంగా ఉందన్నారు.ప్రజలు వదంతులు, అపోహలను నమ్మవద్దని, ఎలాంటి ప్రలోభాలకు లేదా బెదిరింపులకు గురికాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని మైదుకూరు పోలీసు శాఖ విజ్ఞప్తి చేసింది.

పట్టణ ఎన్నికలకు సర్వం సిద్ధం

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి
- ప్రశాంతంగా పోలింగ్ నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు
- జిల్లాలో 4.39 లక్షల మంది ఓటర్లు.. 560 పోలింగ్ కేంద్రాలు, 335 కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్
- నవంబర్ 1న పోలింగ్.. 3న ఓట్ల లెక్కింపు



కడప టౌన్ మన జనప్రగతి అక్టోబర్ 30:- వైఎస్ఆర్ కడప జిల్లాలో పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి తెలిపారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని బోర్డు సమావేశ మందిరంలో జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్, జాయింట్ కలెక్టర్ డా. నిధి మీనాతో కలిసి ఎన్నికల సన్నద్ధతపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల నిర్వహణకు చేసిన ఏర్పాట్లు, పోలింగ్ కేంద్రాల భద్రత, సిబ్బంది నియామకం, వెబ్‌కాస్టింగ్ తదితర అంశాలను వివరించారు.జిల్లాలోని ఏడు పట్టణ స్థానిక సంస్థల పరిధిలో నవంబర్ 1వ తేదీన ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. నవంబర్ 3వ తేదీన ఓట్ల లెక్కింపు చేపట్టనున్నట్లు వెల్లడించారు. కడప నగరపాలక సంస్థతో పాటు బద్వేల్, ఎర్రగుంట్ల, రాజంపేట, పులివెందుల, జమ్మలమడుగు, మైదుకూరు పట్టణాల్లో ఎన్నికలు జరగనున్నాయన్నారు. జిల్లావ్యాప్తంగా మొత్తం 4,39,035 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. వీరిలో 2,12,807 మంది పురుషులు, 2,25,681 మంది మహిళలు, 547 మంది ఇతర ఓటర్లు ఉన్నారు. కడప నగరపాలక సంస్థ పరిధిలో అత్యధికంగా 3,07,093 మంది ఓటర్లు ఉన్నారన్నారు.మొత్తం 345 వార్డులకు గాను 172 వార్డుల్లో ఎన్నికల పోటీ జరగనుంది. మేయర్, చైర్‌పర్సన్ పదవులకు 23 మంది, వార్డు సభ్యుల స్థానాలకు 313 మంది కలిపి మొత్తం 336 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. జమ్మలమడుగులో అత్యధికంగా 28 వార్డులకు 98 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. కడపలో మేయర్ పదవికి 15 మంది, 14 వార్డులకు 48 మంది పోటీ పడుతున్నారు. పులివెందులలో చైర్‌పర్సన్ పదవికి ఇద్దరు, 20 వార్డులకు 54 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారన్నారు. రాజంపేటలో 17 వార్డులకు 62 మంది, మైదుకూరులో 15 వార్డులకు 43 మంది, బద్వేల్‌లో ఒక వార్డుకు ఐదుగురు, ఎర్రగుంట్లలో ఒక వార్డుకు ముగ్గురు పోటీలో ఉన్నారని తెలిపారు. **560 పోలింగ్ కేంద్రాల ఏర్పాటు**ఎన్నికల నిర్వహణ కోసం జిల్లావ్యాప్తంగా 272 ప్రాంతాల్లో 560 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటిలో 155 అత్యంత సమస్యాత్మక, 180 సమస్యాత్మక, 225 సాధారణ పోలింగ్ కేంద్రాలుగా గుర్తించారు. సమస్యాత్మక కేంద్రాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టారు.ఎన్నికల ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించేందుకు 335 పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు చేశారు. అదేవిధంగా 138 ప్రాంతాల్లో పోలింగ్ కేంద్రాల వెలుపల నిఘా కెమెరాలను ఏర్పాటు చేసి పర్యవేక్షించనున్నారు. **3,864 మంది పోలింగ్ సిబ్బంది నియామకం**ఎన్నికల విధుల నిర్వహణకు మొత్తం 3,864 మంది పోలింగ్ సిబ్బందిని నియమించారు. ఇందులో 504 మంది అదనపు సిబ్బంది ఉన్నారు. వీరితో పాటు 208 మంది సూక్ష్మ పరిశీలకులను కూడా నియమించారు. ఎన్నికల విధుల నిర్వహణలో సిబ్బంది సమన్వయంతో పనిచేసేలా చర్యలు తీసుకున్నారు. **ఓటరు స్లిప్పుల పంపిణీ 83.65 శాతం పూర్తి**ఓటర్లకు ఓటరు స్లిప్పులు అందించే కార్యక్రమం వేగంగా కొనసాగుతోంది. అక్టోబర్ 30వ తేదీ నాటికి 4,39,034 స్లిప్పులకు గాను 3,67,269 స్లిప్పులను పంపిణీ చేశారు. దీంతో 83.65 శాతం పంపిణీ పూర్తయింది. మిగిలిన స్లిప్పులను కూడా త్వరితగతిన పంపిణీ చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. **పోలింగ్ రోజున స్థానిక సెలవు**నవంబర్ 1వ తేదీన పోలింగ్ జరిగే ప్రాంతాల్లో ప్రభుత్వ కార్యాలయాలు, స్థానిక సంస్థలు, ప్రభుత్వ సంస్థలు, ప్రైవేటు సంస్థల్లో పనిచేసే ఉద్యోగులకు స్థానిక సెలవు ప్రకటించారు. ప్రైవేటు సంస్థల్లో పనిచేసే ఉద్యోగులకు కూడా వేతనంతో కూడిన సెలవు వర్తిస్తుంది. పోలింగ్, ఓట్ల లెక్కింపు కేంద్రాలుగా వినియోగించే ప్రభుత్వ, విద్యాసంస్థల భవనాలకు అక్టోబర్ 31, నవంబర్ 3 తేదీల్లో సెలవు ప్రకటించారు.ఎన్నికల నిబంధనల మేరకు అక్టోబర్ 30వ తేదీ సాయంత్రం 5 గంటల నుంచి నవంబర్ 1వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు నిశ్శబ్ద కాలం అమల్లో ఉంటుందని కలెక్టర్ తెలిపారు.జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ, ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని కలెక్టర్ స్పష్టం చేశారు. ఓటర్లు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా స్వేచ్ఛగా, నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవా లని ఆయన పిలుపునిచ్చారు. డీఆర్వో మల్లికార్జునుడు, ఎస్డీసి శివరామిరెడ్డి, సంబంధిత ఎన్నికల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఏక పంటకు బదులుగా బహుళ పంటల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలి

- రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ టి. విజయ్ కుమార్



మదనపల్లె, మన జనప్రగతి, అక్టోబర్ 30:- ప్రకృతి వ్యవసాయంలో రైతులు ఏక పంట సాగుకు పరిమితం కాకుండా బహుళ పంటల సాగును ప్రోత్సహించాలని రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ టి. విజయ్ కుమార్ సూచించారు.శుక్రవారం అన్నమయ్య జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్‌తో కలిసి వ్యవసాయ, ఉద్యానవన, అనుబంధ శాఖల అధికారులతో ప్రకృతి వ్యవసాయంపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బహుళ పంటల సాగుతో ఏడాది పొడవునా ఆదాయం పొందవచ్చని, భూసారం పెరగడంతో పాటు సాగు ఖర్చులు తగ్గుతాయని తెలిపారు. ప్రతి రైతుకు ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ శివ నారాయణ, జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ బి. వెంకట మోహన్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



PRINTER, PUBLISHER AND OWNED BY **YADATI VIVEKANANDA REDDY YADAV**, AND PRINTED AT M/S GOKUL PUBLICATIONS, # 4-10-19, Ambakapalli Road, Pulivendula - 516390, Ysr/ Kadapa District, (Andhra Pradesh), PUBLISHED AT # 4-10-19, Ambakapalli Road, Pulivendula - 516390, Ysr/ Kadapa District, (Andhra Pradesh), Editor : YADATI VIVEKANANDA REDDY YADAV, E-Mail :manajanapragathi@gmail.com, Cell : 8125555507 RNI No : - APTEL/2021/80174